# అల్లమప్రభు వచన వైభవము



జానంపేట బృహణ్మఠీయ

## ఆచార్య మఠం లింగయ్యస్వామి

అల్లమప్రభు వచన వైభవము
ఆచార్య మఠం లింగయ్యస్వామి

# అల్లమప్రభు వచన వైభవము



జానంపేట బృహణ్మఠీయ

ఆచార్య మఠం లింగయ్యస్వామి

ప్రచురణ

**బసవ సంక్షేమ సమితి, హైదరాబాద్**

# అల్లమప్రభు వచనవైభవము

అనువాదం, వ్యాఖ్యానం : ఆచార్య మఠం లింగయ్యస్వామి

ప్రథమ ముద్రణ : హేవళంబి ఉగాది - మార్చి 2017

వెల : 400 రూపాయలు

ప్రకాశకులు : బసవ సంక్షేమ సమితి, హైదరాబాద్

© అన్ని హక్కులు ప్రకాశకులవి

ప్రతులు : 1000

ప్రతులకు : 307/2RT, MIGH
Opp : Almond Creek Apartment
P.S. Nagar, Hyderabad - 500 057., T.S.
**Phone : 040-66782211, 23341777**

డిజైన్ : షకీల్ అహ్మద్ (9959652570)

ముద్రణ : కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్,
విద్యానగర్, హైదరాబాద్-44
ఫోన్: 040-27618261

# సంస్మరణ



లిం॥ శరణశ్రీ కల్వ శరణు బసప్ప- ప్రమీలాదేవి

విద్యార్థుల అభివృద్ధియే ధ్యేయంగా 40 సం॥లకు పైగా ఉపాధ్యాయవృత్తిలో
నిరంతరము కృషి సల్పిన ఆణిముత్యము మీరు.
కుటుంబ సభ్యుల అభ్యున్నతియే పరమావధిగా కర్తవ్యమును నిర్వహించి, అందరి
హృదయములలో స్థానము సంపాదించుకొన్న ప్రేమమూర్తులు మీరు.
మానవ సేవయే మహాదేవుని సేవగా తలచి సమాజ సేవలో జీవనం సాగించిన
ధన్యజీవి మీరు.
మీరు సదాశివుని చెంత చేరినా సదా మా జ్ఞాపకాలలో నిలిచి వుంటారు .
మీ సోదరుడు-మరదలు



శరణ కల్వ మల్లికార్జునప్ప- సుచరిత

# మున్నుడి

బసవేశ్వర గీతామృతము ప్రచురణ పిదప కలిగిన అనేకమైన పరిణామములు ఫలితంగా తెలుగునాట శరణ సంస్కృతి తేజోమయంగా విరాజిల్లినది. బసవేశ్వర వచనములలోని భావములు ప్రకాశమానముగా వెలుగొంది అనేకుల యొక్క జీవితములను వెలుగులమయం చేసినవి. ఇటీవలి కాలములో సంభవించిన ఘటనల నేపథ్యములో పరిశీలన జరిపితే ఒక సత్యము దృగ్గోచరము కాగలదు. ప్రతి క్రియావాదుల ప్రయత్న పూర్వకమైన యత్నములద్వారా శరణ సంస్కృతికి యెంత ప్రాముఖ్యత లభించాలో అంత ప్రాముఖ్యత లభించుట లేదు. ఈ వాస్తవిక నేపథ్యములో బసవ సంక్షేమ సమితి శరణ సంస్కృతికి వినూత్నమైన తేజమును కల్పించుటకై నిర్ణయించుకొనిరి. ఒకానొక సభావేదికలో సమితి అధ్యక్షులు ఆచార్య మార్గం బసవరాజ గారు ఈ విషయాన్ని నాకు నివేదించిరి. మహాత్మా బసవేశ్వరునికి ప్రేరకుడై అనుభవ మంటపానికి అధ్యక్షుడై అశేషమైన శరణ సందోహమునకు మార్గదర్శకుడై శరణకాంతిని శాసించే శాసకుడై, సంయమీశులకే సంయమీశుడై శియయోగ శిఖామణిగా వెలుగొందిన అల్లముని వచనములను తెలుగువారికి పరిచయము చేయవలసిన ఆవశ్యకత కలదనియును, తద్వారా శరణ సంస్కృతికి క్రొంగొత్త వెలుగులను ఉప కల్పించమని విజ్ఞాపన చేసిరి. సభాముఖంగా చేసిన వీరి విజ్ఞాపన ఆదరణీయమైనదేఅయినను వృద్ధాప్యము కారణముగా కలిగిన వైకల్యముల నేపథ్యములో చేపట్టదగినది కాదని నా మనస్సు ఘోషించుచుండెను. జంగమునిగా, మఠస్థ అయ్యగా గురుస్థానమును అలంకరించిన వాడుగానున్న నాకు యిట్టి విజ్ఞాపనను మన్నించకపోవుట యుక్తము కాదని నా బుద్ధి వుపదేశించెను. బుద్ధికి నిరంజన పరశివుడు ప్రేరణనిచ్చి సకారాత్మకమైన నిర్ణయమును చేయమని నిర్దేశించెను. పరశివుని ప్రతిరూపులైన గురులింగ జంగములు పరశివ సంకల్పమును నెరవేర్చమని ఆజ్ఞాపించిరి. ఈ ఘటనల యొక్క ఫలితమే నేటి ఈ "అల్లమ ప్రభువు వచన వైభవము" అల్లముని యొక్క వచనములలోని మౌలిక భావములకు యెట్టి భంగము కలుగకుండా అనువాదము సలిపితిని. అల్లముని తత్త్వము లింగ రహస్య

ధర్మమునకు చెందినవి కావున ఏతత్ ధార్మిక సంహిత నేపథ్యములో వ్యాఖ్యానము చేయనైనది.

ఈ కృషిలో అనేకులు వారి వారి శక్తిమేరకు సహకారమును అందించిరి. కొందరు గ్రంథములను అందజేయగా, మరి కొందరు నాకు వలయు యితర సహకారముల నందించిరి.

ఈ కృతి ఈ రూపమును దాల్చుటకు ప్రధాన కారకులు ఇరువురు కలరు. ఒకరు బసవ సంక్షేమ సమితి అధ్యక్షులైన ఆచార్య మార్గం బసవరాజగారు కాగా, మరియొకరు బసవ సంక్షేమ సమితికి చోదకుడై నిలిచిన శరణ కల్వ మల్లికార్జునప్పగారు. వీరిలో ఒకరు సంకల్పమును చేస్తే మరొకరు సంకల్ప సిద్ధికి వలయు సర్వతోముఖ కృషిని చేపట్టిరి. వీరికి సర్వేశ్వరుడు సర్వదా సకల సన్మంగళములను సముచితమైన రీతిలో ప్రసాదించాలని మనసారా ఆశీర్వదించుచున్నాను. బసవ సంక్షేమ సమితి సభ్యులందరికీ పర శివమూర్తి ప్రమోదములు చేకూర్చాలని ఆకాంక్షించుచున్నాను.

వ్యాఖ్యానము కొరకు వలయు గ్రంథములతో పాటుగా అనేకమైన భావ పరమైన భాగదేయములను అందించిన వారిలో శరణగుత్తి చంద్రశేఖరరెడ్డిగారు. శరణ పురాణం నాగయ్యగారు, శరణ కొండా బసవరాజుగారు, శరణ ఆవులశెట్టి పుల్లప్పగారు, శరణ బద్రీనాథ్ గారు ముఖ్యులు. వీరెల్లరకు సకల సన్మంగళములు సిద్ధించాలని ఆకాంక్షించుచున్నాను.

అల్లముని అమూల్యమైన భావములు అందరికీ లబ్ధిని చేకూర్చే ఆణిముత్యములు. వీటిని అధ్యయనము చేసి లబ్ధిని పొందినవారు ఆనూహ్యమైన రీతిలో అన్ని రంగములలో విజయ పథమున పయనించగలరు. అందుచేత శరణబృందము, వీరశైవ జన సామాన్యము, శరణ తత్వాభిమానులు మరియు విజ్ఞత కలిగిన సహృదయులు ఈ గ్రంథమును పఠించి లాభమును పొందాలని ఆకాంక్షిస్తూ ఏతత్ ప్రయత్నములో వీరికి గురులింగ జంగములు కావలసిన ప్రేరణలను యివ్వాలని మనసారా కోరుచున్నాను.

**– ఆచార్య లింగయ్య స్వామి**

శివం భూయాత్

# ప్రకాశకుల మనవి

## బసవ సంక్షేమ సమితి-పరిచయం

మహాత్మా బసవేశ్వరుడు క్రియాశీల సంఘసంస్కర్త. ఆధ్యాత్మిక, సామాజిక రంగములో వచనాల ద్వారా విప్లవాత్మక మార్పులు తెచ్చిన మహనీయుడు. అటువంటి మహనీయుని ఆశయాలకు అనుగుణంగా ఒక సంస్థను స్థాపించి, కార్యరూపమిచ్చే ఉద్దేశ్యంతో 15, డిశంబర్ 2002 వ సం॥లో "బసవ సంక్షేమ సమితి"ని ఏర్పాటు చేయడం జరిగింది. పతనమవుతున్న నైతిక విలువలు, మానవతా విలువల పరిరక్షణకు అనువైన సాహిత్యమును గ్రంథరూపంలో ముద్రించుట, అనుభవ మంటపము వంటి ప్రార్థనా మందిరములను స్థాపించుట, మరియు ఇతర సాంఘిక కార్యక్రమములు చేపట్టుట వంటి సత్సంకల్పంతో 27-06-2002 నాడు ఒక ట్రస్టుగా రిజిష్టర్ చేయబడింది.

వీరశైవ ధర్మ సంస్కృతిని విస్తరింపజేసేందుకుగాను ఆచార్య మఠం లింగయ్య స్వామిగారు రచించిన బసవేశ్వర గీతామృతము మరియు వీరశైవ సంస్కార చంద్రిక అనే గ్రంథములను ముద్రించడం జరిగింది. విశాఖపట్టణవాస్తవ్యులు డా॥ మీగడ రామలింగ స్వామి గారు (26 నంది అవార్డుల గ్రహీత) రచించిన "జై బసవేశ్వరా" నాటకమును హైద్రాబాద్, సంగారెడ్డి, తాండూర్, మహబూబ్‌నగర్, నారాయణపేట్‌లలో ప్రదర్శనలు ఏర్పాటు చేసి, బసవతత్వాన్ని విపులంగా ప్రచారం చేసింది బసవ సంక్షేమ సమితి. బసవలీలాస్తవము, వృషాధిపశతక వైభవము, కాళహస్తీశ్వర శతక వైభవము, నక్షత్రమాల, అక్కమహాదేవి వచనాలు అనే సి.డి.లను ఆవిష్కరింపజేసింది. వీరశైవ ధర్మ ప్రచారములో భాగంగా పేరెన్నికగన్న వీరశైవ పండితుల సహకారముతో మహబూబ్‌నగర్, కర్నూలు, ఆదోని, బళ్లారి తదితర ప్రాంతాల్లో సభలు ఏర్పాటు చేసి బసవతత్వాన్ని వీరశైవ ధర్మమును విపులంగా ప్రచారము చేసింది బసవ సంక్షేమ సమితి. శ్రీశైల జగద్గురు శ్రీశ్రీశ్రీ 1008 ఉమాపతి పండితారాధ్య శివాచార్య మహాస్వామి వారి పట్టాభిషేక స్వర్ణోత్సవాలలో హుబ్లీ

నగరము నందు తెలుగు వీరశైవ సాహిత్య సమ్మేళనము అత్యంత వైభవంగా నిర్వహించింది. శివశ్రీ కల్వ మల్లికార్జునప్ప, కార్యదర్శి చౌరవతో శ్రీశైల దేవస్థానములో అక్కమహాదేవి ఉత్సవాలు బసవ సంక్షేమ సమితి శ్రీశైల దేవస్థానం వారి సంయుక్త ఆధ్వర్యంలో ప్రారంభించబడి ప్రతి యేట వైభవంగా నిర్వహించబడుతున్నవి. 1. బసవేశ్వర గీతామృతము , 2. వీరశైవ సంస్కార చంద్రిక, 3. శ్రీకాళహస్తీశ్వర శతకము, 4. బసవ పంచశతి, 5. జై బసవేశ్వరా! (నాటకం), 6. శ్రీమద్బసవపురాణము, 7. శ్రీమద్బసవరాజీయము, 8. వీరభద్ర తత్త్వసారము, 9. వీరభద్ర వైభవము, 10. చెన్నబసవపురాణము, 11. శరణు బసవ, 12. బసవకృప దశాబ్ది సంచిక తదితర పుస్తకములు ప్రచురింపబడినవి.

వీరశైవ మరియు బసవ తత్త్వమును ప్రచారము చేయు నిమిత్తం, పై పుస్తకములు ప్రచురించడము, మరియు సి.డి.లను ఆవిష్కరింప చేయడము జరిగినది. ఈ మధ్యకాలములో శరణ సంస్కృతిని కాపాడుకొని ఆచరింపచేయాలనే సంకల్పము మా సమితి ధర్మకర్తల మండలిలో వేళ్ళూనుకొన్నది. బసవేశ్వరుని వచనముల తర్వాత, ప్రాధాన్యత సంతరించుకొనిన వచనాల పరంపరలో అల్లమ ప్రభు వచనాలను పేర్కొనవచ్చును. ఇంతవరకు అల్లమప్రభు వచనములు తెలుగులో బసవ సమితి బెంగుళూరు వారు ప్రచురించిన 'వచన' సంపుటిలో పొందుపరచబడినవి. ఈ వచనముల వర్గీకరణగాని వాటికి వ్యాఖ్యానముగాని లేకపోవుటచే, వాటిని సరియైన రీతిలో అవగాహన చేసుకొనే అవకాశము కొందరికి మాత్రమే కలదని తెలియవచ్చింది. ఈ విషయమును దృష్టిలో పెట్టుకొని, ఒకానొక సభలో, కన్నడములోవున్న అల్లముని వచనములను తెలుగులోకి అనువదించి, వ్యాఖ్యానము వ్రాసి, శరణ సంస్కృతికి క్రొంగొత్త వెలుగులను ప్రసరింపచేయవలసినదిగా ఆచార్య మఠం లింగయ్య స్వామిని కోరడము జరిగినది. వారు మొదట్లో వృద్ధాప్య కారణముగా కల్గిన వైకల్యములను దృష్టిలో పెట్టుకొని తన అశక్తతను వెలిబుచ్చిరి. ఐనను మా సమితి మరీమరి విజ్ఞాపనలు చేయుటవలన వారు చివరకు యీ కార్యమును నెరవేర్చుటకు అంగీకరించి, కన్నడంలోని 229 వచనములకు తెలుగు అనువాదము, వ్యాఖ్యానము వ్రాసి, ప్రథమ సంపుటిగా మా కందించిరి. ఈ వచనములు షట్ స్థలములలోని, భక్త, మహేశ, ప్రసాద, స్థలములు పూర్తిగాను, ప్రాణలింగి స్థలములో

కొంత భాగము వరకు అనువదించబడినవి. మిగతా వచనములను రెండో సంపుటిగా వెలువరించడానికి మా సంస్థ ప్రయత్నము చేయగలదు. శారీరక ఇబ్బందులున్నప్పటికి మేము చేసిన విజ్ఞాపనను మన్నించి, "అల్లమప్రభు వచన వైభవము" ప్రథమ సంపుటిని పూర్తి చేసి యిచ్చిన అచార్య మఠం లింగయ్య స్వామిగార్కి, బసవ సంక్షేమ సమితి ధర్మకర్తల మండలి సర్వదా కృతజ్ఞతలను వినమ్రముగా అందచేయుచున్నది.

తప్పుల సవరణలో తమవంతు సహకారమందించిన ఆవులశెట్టి పుల్లప్ప మరియు పురాణం నాగయ్య స్వామి గార్లకు ప్రత్యేక ధన్యవాదములు.

ఈ గ్రంథ ప్రచురణ నిమిత్తం ఆర్థిక సహాయమునందించిన, మా సమితి కార్యదర్శి, శరణశ్రీ కల్వ మల్లికార్జునప్ప గారి ఔదార్యము మరువలేనిది.

ఈ గ్రంథము ద్వారా అల్లమ ప్రభు వచనాలకు ఎంతో ఆదరణ లభించగలదని ఆశించుతున్నాము. ఈ బృహత్ కార్యక్రమములో తమ సహకారము నందించిన ప్రగతి శీల వీరశైవ సమాజము, ఆల్విన్‌కాలనీ : రాష్ట్ర వీరశైవ సేవా సమాజము, బల్కంపేట, వీరశైవ సమాజము, జగద్గిరి గుట్ట, వీరశైవ సమాజము, కూకట్‌పల్లి, అక్క మహాదేవి మహిళా విభాగం, హైదరాబాదు వారికి ప్రత్యేక ధన్యవాదములు. ఈ కార్యక్రమ నిర్వహణలో బసవ సంక్షేమ సమితి ధర్మకర్తల మార్గదర్శనము మరియు సహాయ సహకారములు మరువలేనివి.

ఈ గ్రంథమును సర్వాంగ సుందరంగా అచ్చువేయడంలో సహకరించిన కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్ అధినేత శ్రీ జగన్మోహన్‌రెడ్డిగారికి, ప్రత్యేకించి ముఖచిత్రమును డిజైన్‌చేసి, ముద్రారాక్షసములు లేకుండా పుస్తకాలంకరణ చేసిన శ్రీ షకీల్ అహ్మద్ గార్కి మా ప్రత్యేక ధన్యవాదములు. డి.టి.పి.లో వారికి సహకరించిన శ్రీమతి పద్మ, కుమారి శైలజ, కిషోర్ కుమార్ రెడ్డి, రామేశ్వర్ గార్లకు కృతజ్ఞతలు.

హేవళంబి, చైత్రం (ఉగాది)
2017, హైదరాబాద్

కార్యదర్శి
**కల్వ మల్లికార్జునప్ప**

అధ్యక్షులు
**మార్గం బసవరాజ**

# బసవ సంక్షేమ సమితి
# ధర్మకర్తల మండలి

| | |
|---|---|
| డా॥ మార్గం బసవరాజ, | అధ్యక్షులు |
| శ్రీ కల్వ మల్లికార్జునప్ప, | కార్యదర్శి |
| శ్రీ బి. రాజయ్య, | ధర్మకర్త |
| శ్రీ జి. రాఘవరెడ్డి, | ,, |
| శ్రీ ఎ. బాల్లింగం | ,, |
| శ్రీ వాలి బస్వరాజ్ | ,, |
| శ్రీ కొప్పనూరు బసప్ప | ,, |
| శ్రీ ఎస్.ప్రభాకర్ | ,, |
| శ్రీ డి.బి. ప్రకాశ్ | ,, |
| శ్రీ హేరూరు విజయ్‌కుమార్ | ,, |
| శ్రీ అవులశెట్టి పుల్లప్ప | ,, |
| శ్రీ కొంక రాజేశ్వర్ | ,, |
| శ్రీ శెట్టి రమేశ్ | ,, |
| శ్రీ సి.హెచ్. బద్రినాథ్ | ,, |
| శ్రీ కల్వ శివకుమారప్ప | ,, |
| శ్రీ కొల్లిపర కోటివీరయ్య | ,, |
| శ్రీ కె. ఎస్. సోమశేఖర్ | ,, |
| శ్రీ బి. రవికుమార్ | ,, |

# పీఠిక

## చారిత్రాత్మక నేపథ్యము

సుదీర్ఘమైన చరిత్రగల భారతావనిలో అనేకమైన ఘటనలు సంభవించినవి. వీటిలో కొన్ని విదేశీయుల దండయాత్రల వలన సంభవిస్తే మరికొన్ని దేశాంతర్గతంగా ఘటించిన ఘటనల వలన సంభవించినవి. ఈ ఘటనల చేత ఉత్పన్నమైన స్థితిగతులు ప్రజా జీవనములోని అనేక రంగములను తమ తమ ప్రభావమునకు గురిచేసినవి. యిట్టి అసంఖ్యాకమైన ఘటనలకు నిలయమైన కాలమే క్రీ॥శ॥12 శతాబ్ది.

దేశ రాజకీయ వ్యవస్థ ఛిన్నాభిన్నమై ఉండెను. ఢిల్లీ నగరము మహమ్మదీయుల వశమై ఉత్తర భారతములోని గణనీయమైన ప్రాంతములు వీరి ఏలుబడిలోనికి వచ్చి యుండెను. దక్షిణ భారతదేశములో అనేకమైన రాజ్యములు రాచరిక నేపథ్యములో పాలింపబడుచుండెను. వీటిలో చాళుక్య రాజ్యము గణనీయమైనది. నేటి కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మొదలగు ప్రాంతములన్నియు చాళుక్య పాలనలో యుండెను. మహ్మదీయ రాజుల దృష్టి వీరివైపు ప్రసరించుచుండెను. ఇది యిటులుండగా రాజకీయ అస్థిరత్వము అధికారమునకై పెనుగులాట, సామంత రాజుల విజృంభణ, మొదలగు లక్షణములచే రాజకీయ వ్యవస్థ చాలా బలహీనమై యుండింది. తత్ఫలితంగా వివిధ రంగములలోని అమానుష పాశవిక శక్తులు తమ తమ శక్తులను పుంజుకొని విలయతాండవము చేయుచుండెను. ఈ శక్తులు వివిధ మత సాంప్రదాయముల నాశ్రయించి సామాజిక సంక్షేమమును శాంతి భద్రతలను ప్రకృతి సంపదను నైతిక విలువలను నాశనము చేయజొచ్చెను. ఈ స్థితి నుండి లబ్ధిని పొందుటకు కొందరు వ్యక్తులు కొన్ని వర్గాలు కొన్ని కూటములు రాజాశ్రయమును సంపాదించి ప్రతిపక్షములో యున్న వారిని నిర్వీర్యులనుగా చేసి తుదముట్టించుటకై అనేకమైన ప్రయత్నములు చేయజొచ్చిరి. తత్ఫలితంగా ఆధ్యాత్మిక రంగము అయోమయమైన స్థితిలోనుండెను. సాహిత్య-సాంస్కృతిక రంగములు

అధికారములో నున్న వారిని కీర్తిస్తూ తమ జీవనమును కొనసాగించుచుండెను.

దేశములో నెలకొనియున్న ఈ స్థితిని ఎదుర్కొని సమగ్రమైన సామాజిక మార్పును సాధించే ప్రయత్నము మొట్ట మొదటిసారిగా చాళుక్య రాజధానిలో ప్రారంభమైనది. ఈ యత్నము మహోద్యమ రూపమును దాల్చెను. అన్ని వర్గముల వారి సమస్యలను తీర్చుటకై సమగ్రమైన ప్రణాళిక రూపొందించబడెను. ఈ ప్రయత్నము లన్నియును మహాత్మా బసవేశ్వరుని యొక్క నేతృత్వములో జరుగుచుండెను. ఈ ప్రయత్నముల యొక్క లక్ష్యములు తెలియజేయుటకై మఱియు ప్రజలను లక్ష్యసాధన వైపు పయనింపజేయుటకై వచన సాహిత్యము అనునది ఉపకరించెను.

ఈ వచనములు వ్రాసినవారు ఒక ప్రసిద్ధ కవియో లేక రాటుదేలిన పండితుడో ఒక సిద్ధాన్త కర్తనో ఒక ఉద్యమ కారుడో ఒక ఉద్వేగ భరిత జీవియో అని అనుకోవడానికి ఆస్కారము లేకుండెను. సమాజములోని అన్ని వర్గములకు చెందిన వారు వచన రచనను కొనసాగించిరి. దీనిని ఒక పవిత్రకార్యముగా ఎంచి ఎంతో శ్రద్ధాసక్తులతో రచనలను చేపట్టిరి. తత్ఫలితంగా వచన సాహిత్యము దక్షిణ భారతదేశ చరిత్రను పురోగమనము వైపు పయనింపజేసే చోదక శక్తిగా మారెను. కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణా మఱియు ఆంధ్ర, తమిళనాడు, శ్రీలంక ఇత్యాధి ప్రాంతములకు చెందిన మేధావులు పండితులు, కళాకారులు, సాహిత్య విమర్శకులు ఈ వచనముల యొక్క ప్రకాశమును నేపథ్యముగా గొని తమ తమ కృతులను వెలువరించిరి.

### వచనము

సర్వసాధారణంగా గద్యమును వచనము అను పేరుతో పిలుస్తారు. అయితే ఈ వచనములు కేవలము గద్యములుగా భావించడానికి వీలులేదు. వచన రచయితలు-రచయిత్రులు ఛందో వ్యాకరణాది నియమాలను పాటించలేదు. అందుచే వీటిని పద్యములుగా భావించటానికి వీలులేదు. వచనములు రచయితల ఇష్టాను సారముగా కొనసాగినవి. పాద నియమం కూడా వీరు పాటించలేదు. భావమే ప్రధానమైన అంశముగా నిలుస్తుంది. భావాన్ని ప్రసరితము చేయుటకై శక్తివంతమైన శబ్దములు ప్రయోగింపబడినవి. దృష్టాంతములు ఈయబడినవి. ఉపమానములు

ప్రదర్శితములైనవి. ఇవి యన్నియు చదువరుల యొక్క గుండెలకు కత్తుల్లా గ్రుచ్చుకుంటాయి. ప్రతికూల భావములను ఛేదిస్తాయి. సానుకూల భావములకు చేవనిస్తాయి. మానసిక మార్పుకు దోహదం చేస్తాయి. క్రాంతి పథమునకు కాంతి పుంజములై ప్రకాశిస్తాయి.

ప్రతి వచనకారుడు ఒక మకుటమును ఎంపిక చేసుకోవటం జరిగినది. బసవేశ్వరుని వచనాలలో కనిపించే మకుటము 'కూడల సంగమదేవా" ఈ మకుటములో సూచితమైనవాడు నిర్గుణ పరబ్రహ్మే. వచనకారులు వీరశైవమును ఆశ్రయించినప్పటికిని వారి దృష్టిలో శివుడుయనగా ఉపనిషత్‌వాదులు సూచించే నిర్గుణ పరతత్వమే. దేవాలయాలలో ప్రతిష్టితమైన సగుణ తత్వము మీద వచన కారుల మనస్సు నిలువదు. ఈ కారణము వలన వీరు దేవుడుగా భావించే శివుడు నిరాకార నిరంజన స్వరూపుడు.

వచనములు లయబద్ధంగా యుండును. గానం చేయుటకు వీలుగా ఉంటాయి. వచనములను ప్రచారములోనికి తీసుకొని వచ్చే పవిత్రకార్యమే కాయకముగా కలిగిన జంగముల బృందము వీణను వాయిస్తూ లేదా తంబూర వాయిస్తూ, ఢమరుకం వాయిస్తూ వచనములు పాడుతూ దేశాటన చేయువారు. సంచార జీవులై జీవనము సాగించేవారు.

ప్రఖ్యాతి గాంచిన వచనకారులలో అల్లమ ప్రభువు అతి ముఖ్యమైనవాడు. ఈతడు వ్రాసిన వచనముల సంఖ్య గణనీయమైనది. కర్ణాటక ప్రభుత్వం వారు ప్రకటించిన సంపుటిలో 1636 వచనములు గలవు. వీటి వాసి గొప్పదని ఎంచబడుచున్నది. అల్లమా ప్రభువు యొక్క ప్రభావము ఇతర వచనకారులపైన గూడా కలదని తెలియుచున్నది (శూన్య సంపాదనము చూడగలరు). వచనకారులెల్లరు అల్లమ ప్రభు సూచించిన సూచనల మేరకు తమ తమ వచనములలో మార్పులు – చేర్పులు మరియు కూర్పులు చేసిరని తెలియుచున్నది. దీనికి గల కారణమేమనగా అల్లమా ప్రభు గొప్ప ధీశాలి గాను, ఆధ్యాత్మికవేత్తగాను, అనుభావిగాను, యోగీశ్వరునిగాను, అందరి మన్ననలను పొందియుండెనని చెప్పక తప్పదు.

**అల్లముని నామ విశ్లేషణ**

అల్లమ ప్రభువు వచనకారుల చేత మరియు నాటి కవుల చేత అల్లయ్యగాను, అల్లమయ్యగాను, అల్లమ ప్రభువుగాను, ప్రభుదేవునిగాను, ప్రభురాయునిగాను కీర్తింపబడెను. అల్లమ అను శబ్దములోని అల్ల అను పదము "కాదు" లేదా "లేదు" యను అర్ధమును సూచిస్తుంది. యిచట లేదు యనగా కాయములేని వాడుగా గ్రహింపదగును. సిద్ధ పురుషుడిగా గుర్తింపబడిన అల్లమ ప్రభువు వాయు శరీరియని శ్రీ గౌరన వ్రాసిన నవనాథ చరిత్ర వంటి కావ్యములలో సూచితమైనది. "మా" యను పదము మహాత్మయను పదము యొక్క సంక్షిప్త రూపముగా గుర్తిస్తే ప్రభువుయను శబ్దము స్వతంత్రత్వమును సూచిస్తుంది. మహాప్రభువు యనగా గొప్పనైన స్వేచ్ఛాజీవి. దేవర శబ్దము సామాజిక గౌరవ వాచకమై యున్నది. అల్లమా ప్రభువు యను నామములో సర్వజ్ఞత్వము, సర్వకర్తృత్వము, స్వతంత్రత్వము గలిగిన పరశివుడే సూచితమైనాడని గ్రహింపవచ్చును. అయితే కొందరు ఈ పేరుకు తమకు దోచిన వ్యాఖ్యలను చేసి విపరీతార్థములను ఆపాదించుచున్నారు. అల్లాయనగా మహ్మదీయ మతములోని దేవుని పేరనియు, ప్రభువు యనగా క్రైస్తవుల దేవుడనియు, దేవాయన్న శబ్దము హైందవుల దైవ స్వరూపమనియు చెప్పుచున్నారు. పాఠకులు క్షీర-నీర న్యాయమున సత్యమును గ్రహింతురు గాక.

ప్రభుదేవుని జీవితచరిత్రను విస్పష్టముగా తెలియజేయు విశ్వసనీయమైన ఆధారములు లభించుటలేదు. తెలుగు కవులలో అల్లమ ప్రభు గురించి తెలిపిన వారిలో పాలుకుర్కి సోమనాథుడు ప్రప్రథముడు.

> **"నంతనల్లమ ప్రభువను సంయమీశుఁ**
> **దంతకాంతకమూర్తి యతులిత కీర్తి నిర్మూలితోద్రిక్త దుర్మలుఁడుభయ**
> **కర్మ నికృంతన కర్మ కర్మఠుడు**
> **వైరాగ్య సంసార వర్జితాత్మకుడు**
> **దూరదృష్ట్యా దృష్టచారు చర్యుండు**
> **దాన ప్రతిగ్రహ హీన వర్తనుడు**
> **మానావమాన సమాన కీర్తనుఁడు**

..........................

.........................

**బసవదల్లంతట బ్రణమితుండగుచు**
**నసలార సముచితాభ్యర్చితుఁజేసి**
***లింగ తూర్యములు సెలంగ నుప్పొంగి***
***మంగళారతులెత్తె మహిఁ దత్క్షణంబ***

(బసవ పురాణము ఆశ్వాసము ద్వితీయ) సోమనాథుని శిష్యులమని ప్రకటించుకొనిన పిడపర్తి కవులు ప్రభుదేవుని చరిత్రను వర్ణిస్తూ కావ్యములు రచించిరి. పిడపర్తి సోమన "ప్రభులింగలీల" యను (ద్విపద కావ్యము) (పిడపర్తి బసవన పద్యకావ్యము) ఈ కోవకు చెందినవే. యింతియే గాక అల్లమ ప్రభు పేరిట అనేకమైన రచనలు వెలువడినవి. వీటిలో పురాణములు – నాటకములు – యక్షగానములు కలవు. గౌరన మంత్రిగారు రచించిన నవనాథ చరిత్రలో ప్రభుదేవుని గురించిన ప్రస్థావన గలదు. అయితే వీటిలో ప్రభుదేవుని చరిత్రను సమగ్రంగా తెలియజేయు అంశములు పరిమితంగానే యున్నవి. మీదు మిక్కలి యివియన్నియు కన్నడ భాషలో వెలువడిన కావ్యముల యాధారముగా స్వీకరించి రచించబడినవి.

12వ శతాబ్ధికి చెందిన హరిహరుడు "ప్రభుదేవర రగడ" రచియించినాడు. చామరసు "ప్రభులింగలీల"యను గ్రంథమును రచించెను. యిదే విధంగా హరీశ్వరుడు మొదలుకొని కొందరు కర్ణాటక కవులు అనేక గ్రంథములు ప్రభువుగారి గురించి రచించిరి. ఇవి ఏవియును చారిత్రాత్మక దృష్టి కలిగియున్నవి గావు. మహిమలతో, కల్పనలతో పూర్తిగా నింపబడిన కథల సంకలనములు. ప్రభుదేవుని పౌరాణిక పురుషునిగా చిత్రించే ప్రయత్నములు కలిగినవి.

మరాఠి, తమిళము, సంస్కృతము మొదలగు భాషలలో ప్రభుదేవుని గురించి రచియింపబడిన కృతులు గలవు. వీటిలోను చారిత్రక అంశములు మృగ్యములే. తార్కిక దృష్టితో చూచిన యెడల ప్రభుదేవుని వచనములలో కొంతవరకు సమాచారము లభించగలదని తెలియుచున్నది. ఈ సమాచారమునే ఆధారముగా చేసుకొని ప్రభుదేవుని జీవితచరిత్ర క్రింది విధముగా ఊహించవచ్చు.

ప్రభుదేవుని జన్మస్థానము బళ్ళిగావి. యిది శివమొగ్గ (శిమోగా) జిల్లాలోని శికారిపుర తాలుకలోని కుగ్రామము. ఈ గ్రామము నాడు ప్రఖ్యాతిలోనున్న 'బనవాసి' యను పట్టణమునకు సమీపమున నుండుటచేత ఎంతో గుర్తింపు పొందినదై యుండెను. ప్రభుదేవుని తల్లిదండ్రుల పేరు తెలియవచ్చుట లేదు. కావ్యములలో నీయబడిన పేర్లు కల్పిత పేర్లుగా అగుపడుచున్నవి. హరిహరుడు 'నాగవాసాధిపతి" యను పేరును తెలుపగా చామరసు తండ్రి నిరహంకారి, తల్లి సుజ్ఞాని యను దంపతుల పేర్లను పేర్కొనినాడు. ప్రభుదేవుడు కళావంతుల కుటుంబములో జన్మించెనని తెలియుచున్నది. కళావంతులు దేవాలయములలో 'మద్దెల'ను వాయిస్తూ, లేక నాట్యము చేయుచు తమ జీవనయాత్ర కొనసాగించేవారు. గొగ్గేశ్వర దేవాలయములో ప్రభుదేవుడు మద్దెల వాయించేవాడనియు, అతడు వాద్య కళాకారునిగా సంపూర్ణ ప్రావీణ్యతను సంపాదించి యుండెనని తెలియుచున్నది. అల్లముని వైవాహిక జీవనము గురించి భిన్నమైన యభిప్రాయములు గలవు. హరిహరుని ప్రకారము ప్రభుదేవుడు వివాహితుడు. కామలతా యను పేరు గల్గిన ఒకానొక యపురూప సౌందర్యరాశిని పరిణయమాడినాడు. ఈమె ఉన్నత వర్ణమునకు సంబంధించినదని కొన్ని కావ్యములు తెలుపుచున్నవి. వైశ్యవర్ణమునకు చెందిన ఈమెను వివాహమాడుటచే అల్లముని జీవితములో అనేకమైన ప్రతికూల ఘటనలు సంఘటిల్లెననియు అతనికి ఎంతో మనస్తాపము కలిగెననియు ఈ ఘర్షణముల కారణముననే భార్యకు దూరమయ్యేనని తెలుపబడినది. హరిహరుడు కామలత అకాల మరణము పొందెనని తెలిపెను. అయితే చామరసు కథనము ప్రకారము ప్రభుదేవుడు అవివాహితుడు. కామమును జయించిన వాడుగా పరిగణించాడు. ఒకానొక అద్వితీయ అపురూప సౌందర్య రాశి ఈతనిని వరియించెననియు, సంపన్న కుటుంబమునకు చెందిన ఈమె ప్రేమను ప్రభువు తిరస్కరించె ననియు, కామ మోహితురాలైన ఈమె ప్రభుదేవుని వెన్నంటివచ్చి అనేక విధములుగా కామ వికార చేష్టలచే బాధించెననియు తెలుపబడినది. చిట్ట చివరకు ఆమె తన అపజయమును అంగీకరించి వెనుదిరిగి వెళ్లెనని తెలియుచున్నది.

వచనములలో ఇమిడియున్న భావ పరిపక్వతను గమనించినచో ప్రభుదేవుడు నిత్య వైరాగ్య సంపన్నుడని తేటతెల్లమగును. ఈ క్రింది వచనము గమనార్హమైనది.

విసరకుము విసరకుము కామా
నీ బాణం వ్యర్థం కానేలరా?
కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యం
ఇవి చాలవా నీకు
గుహేశ్వర లింగంకై విరహంతో కందినవారిని
మళ్లీ కాల్చుట సాధ్యమా పిచ్చి కామా

(బసవసమితివారి 'వచనము'లోని 480వ వచనము)

వైరాగ్య సంపత్తిగల్గిన జీవులు ఆధ్యాత్మిక సంపత్తిని పొందుటకు యత్నింతురనేది భారతీయ సంస్కృతిలో నెలకొని యున్న నిత్య సత్యము. తదనుగుణముగనే ప్రభుదేవుడు సంసార హేయ భావమును పొందిన పిదప ఆధ్యాత్మిక మార్గమున అడుగిడెను. గొగ్గేశ్వర దేవాలయములో మృదంగ కళాకారునిగా యున్న సందర్భములో ఏర్పడిన సంబంధములను పురస్కరించుకొని వివిధ శైవ పరంపరలకు చెందిన వ్యక్తులతో సంఘత్వమును పెంచుకొనెను. నాటి కాలాముఖ, పాశుపత, లకులీశ, భైరవ, కాపాలిక, గాణాపత్యవైరభద్ర్య ఇత్యాది మత గురువులను ఆశ్రయించెను. నాథ సాంప్రదాయమునకు సంబంధించిన సాధకులతో సుసంగత్వమైన సంబంధములను నెలకొల్పుకొనెను. ప్రసిద్ధమైన సిద్ధిపుంగవులతో సాంగత్యము చేసి సర్వదర్శనముల యెడల సమతా భావమును జూపిన వాడయి సమభావముతో సంచరించెను. ఆతని లక్ష్యము ఒక్కటే. శివతత్వమును ఎరిగి జీవతత్వమును అవగతము చేసుకొని ప్రకృతిలోని రహస్యములను ఛేధించి పరమ పదమును పొందుటకు సులభసాధ్యమైన మార్గమును అన్వేషించుటయే :

ఈ యత్నములో అతడనేక సం॥లు గడిపెను. నిలిచిన చోట నిలువక తిరుగాడు చుండెను. మనమునకు శాంతి లేక పరితపించుచుండెను. చకోరము చంద్రుని వెన్నెలకై తహతహలాడినటుల యాతడు సద్గురు సదుపదేశము గుఱించి వాంఛించుచుండెను. ఈతని తపన వృథా కాలేదు. ఈ తపన వలన సమస్త సమయాచారముల యొక్క సంవిత్ స్వరూపము అతనికి దృగ్గోచరమయ్యెను. వివిధ మతసాంప్రదాయాలయొక్క లోగుట్టు బహిర్గతమయ్యెను. గుణదోషముల

మూల్యాంకన ఘటియించెను. అతడిపుడు ఉత్తమోత్తమమైన పథమును ఎంపిక చేసుకొనుటకు వలయు అర్హతను పొందిన వాడయ్యెను.

అచిర కాలములోనే యాతడు అనిమిషయ్య అను ప్రసిద్ధ వైరాగ్య నిధియైన గురువును దర్శించెను. గురు కారుణ్యమును పొందెను. భవమును ఛేదించే ఉపాయమును తెలుపుమని ప్రార్థించెను. మాయను గెలుచు మార్గమేమిటో చూపుమనెను.

శిష్యుని మానసిక స్థితిని ఆధ్యాత్మిక పరిణితిని నైతిక ఔన్నత్యమును నిశ్చయములోని దృఢత్వమును పూర్వాశ్రయ నిరసన ఇత్యాదులను గమనించిన గురుకులోత్తముడు అల్లమునిలోని శక్తిపాతమును పరీక్షించెను. శివదీక్షను పొందుటకు అర్హుడని నిశ్చయించుకొనెను. వేదా దీక్ష, క్రియాదీక్ష, మంత్రదీక్షలను ఒసంగెను. హస్తమస్తక సంయోగము ద్వారా ఆతనిలోని చిచ్ఛక్తిని ఆకర్షించి ఆతని ఇష్టలింగములో నిక్షేపించెను. ఇష్టలింగములోని కళతో ప్రాణశక్తికి అనుసంధానము చేసెను. ఈ విధముగా అష్టావరణముల చేత పరిరక్షితుడిగా చేసిన గురువు అతనికి పంచాచారములను, షట్‌స్థల జ్ఞానమును ఉపదేశించెను. జంగమ పర్యవేక్షణలో సాధనను సుసంపన్నము చేసుకోవలెనని సముచితమైన రీతిలో సందేశము నిచ్చెను.

తదుపరి అల్లముడు తాను పొందిన అనుభూతిని తన (101) వ వచనములో అభివ్యక్తము చేసిన వాడాయెను. ఈ వచనములోని భాష మర్మ గర్భితమైనది. సామాన్యులకు అవగతమయ్యేదిగాదు. పరవాదులకు అంతుచిక్కనిదై యున్నది. యౌగిక పరిభాషనెఱిగిన లింగ తత్వజ్ఞులు మాత్రమే యిందులోని భావమును గ్రహింపగల్గుదురు. ఈ కారణము వలననే చాలామంది ఈ వివరములను ఎరుగని వారై అల్లముడు పొందిన లింగదీక్షను గుఱించిన వివరములు తెలుపుటలో వైఫల్యమును పొందిరి. సమాధి స్థితిలోనున్న అనిమిషయ్య ఇష్టలింగమునే ప్రభువు తన యిష్టలింగముగా గ్రహించెనని వ్రాసిరి. యిది వీరశైవ తత్వమునకు లైంగ్య ధర్మమునకు విరుద్ధమైన భావన. ఇష్టలింగమనేది వైయక్తికమైనది. ఎవరి ఇష్టలింగము వారిదే. ఎవరి ప్రాణము వారిదైనట్లే ఎవరి లింగము వారికి ప్రాణప్రదమైనది. ఒకరి ప్రాణమును మరొకరికి నీయగలమా? విజ్ఞులు సత్యమును గ్రహింతురు గావుత.

అల్లముదు సాధకుడై కఠిన పరిశ్రమకోర్చి అనుష్టానాదులు సలిపి ఆచార సంపత్తితో పుష్టిని షట్స్థల జ్ఞానములో గరిష్టమైన స్థాయిని సంపాదించెను. స్వామిభృత్య న్యాయముతో గురులింగ జంగములను సేవించి భక్తుడయ్యెను. నిష్ఠా నియమ సంపత్తిని పెంచుకొని మహేశ్వరుడయ్యెను. అవధాన భక్తిని అలవరచుకొని నిత్యసత్య ప్రసాదియయ్యెను. శుద్ధ సిద్ధ ప్రసిద్ధ ప్రసాదములను పొంది లింగ శరీరియయ్యెను. అనుభవ భక్తిసంపన్నుడై ప్రాణ లింగియయ్యెను. మహాశివయోగిగా పరిణామమును పొందెను. లింగపతి-శరణసతి అనుభావమును పొందినవాడై ఆనంద భక్తిలో నోలలాడి సత్య శరణుడయ్యెను. నిత్యానంద పరిస్ఫూర్తిని పొందెను. సత్యానందమునకు ఆశ్రయమయ్యెను. సమరస భక్తితో సాధనచేసి శిఖి కర్పూర న్యాయమున లింగైక్యుడయ్యెను. శూన్య స్థానమున సమాధిగతుడై సాధనచేసి శూన్య పీఠాధిపతియయ్యెను.

తాను గడించిన దివ్యానుభూతి నేపథ్యములో స్వయం ప్రకాశమానుడై సంచారమును సలుపుతూ లోకోద్ధరణ కార్యక్రమమును చేపట్టెను. నిత్య సంచార జీవియై సత్యమైన జంగమునిగా సంవిత్ ప్రభలతో వెలుగొందెను. ఈ విధంగా సంచరిస్తూ అనేకమైన తాడిత-పీడిత జనుల సముద్ధరణ చేస్తూ సంచారము సలిపే క్రమములో ఎంతోమంది ప్రముఖులకు జ్ఞానోపదేశమును చేసెను. అతని ద్వార జ్ఞానోపదేశమును పొందిన వారిలో ముక్తాయక్క, గొగ్గయ్య, సిద్ధ రాముడు, గోరక్షనాథుడు అతి ముఖ్యులు. (వివరములకై శూన్య సంపాదనను చూడగలరు). వీరిలో ముక్తాయక్క గొప్ప శివశరణీమణి అజగణ్ణయని పిలువబడు ఒక మహనీయుని సోదరి. తన అన్నను గురువుగా స్వీకరించి గొప్ప సాధన చేసిన సాధకురాలు. సోదరుని ఆకస్మిక మరణము వలన గల్గిన పరితాపము తాళలేక ఆమే ఆధ్యాత్మిక ఔన్నత్యమునుండి పతనమును పొంది భవసాగరములో మునిగిపోయెను. అల్లముదు ఆమెను పైకెత్తి భవమును బారద్రోలి లింగధర్మ రహస్యములను వివరించి తాపోపశమనమును కలిగించెను. ఆమె యథాస్థితికి చేరి స్వేష్ట లింగోపాసన, నిత్యజంగమారాధనల ద్వార లింగాంగ సామరస్యమును పొందుటకై మార్గమును సుగమము గావించెను. గొగ్గయ్యకు బహిరార్చన యొక్క నిష్ఫలత్వమును దెలిపి అంతర్లింగాను సంధానమైన రహస్యములను తెలియజేసెను.

ఈ సందర్భములో ప్రభుదేవుడు నుడివిన వాక్కులు గమనించండి.

"తనువును తోటగా జేసి, మనసును గొద్దలిజేసి, కొట్టి పెల్లగించి తీసితినయ్యా భ్రాంతివేరులు. సంసారమను మట్టిగడ్డను కొట్టి విత్తితినయ్యా బ్రహ్మ బీజమును, అఖండ మండలమను బావి, పవనమే మోట, సుషుమ్నా నాళంబు నుంచి ఉదకంబు తీసి బసవలైదుగురు పస చెడుపుదురని సమత సైపను కంచెగట్టి ఎల్లప్పుడు ఈ తోటయందు జాగరముండి మొలకను రక్షించితిని చూడుమా గుహేశ్వరా!" (శూన్యసంపాదన చూడగలరు).

ఈ వచనములోని అంతరార్థము ఎంతో నిగూఢమైనది. మొక్క అనుపదము అనుభవ సంపాదనను సూచించుచున్నది. ఈ అనుభవ సంపాదన ధృఢతరమై దినదినాభివృద్ధి చెందుటకై ప్రాణలింగాను సంధానము ఆవశ్యకమై యుండును. ప్రాణాయామాది క్రియల ద్వార గ్రహింపబడు పవన గతులే ప్రాణలింగాను సంధానమున గతి శీలతనునిర్ణయించేవి. ఈ యత్నములో సాఫల్యతనొందితే చిదాకాశములో నెలకొనియున్న చిత్ కూపమునుండి చిదామృతమును దోడి త్రాగగలము. ఈ అమృత పానము వలన అనుభవము పటుతరమై లింగాంగ సామరస్యమును సాధించగలరు. ఈ యత్నములో కొన్ని ఆవశ్యమైన చర్యలు చేపట్టవలసి యుండును. భ్రాంతిని చెఱిచి సంసార బంధములను భగ్నము చేయవలెను. సంవిజ్ఞానమనే విత్తనమును నాటవలెను. చివరగా సుషుమ్నా నాడిపైన పూర్ణనియంత్రణ సాధించవలెను. పంచేంద్రియములు తమ ప్రభావమును చూపకుండ శమ దమనాదులను చేపట్టవలెననేది మరియొక అంశము. సిద్ధరాముడు శుద్ధ దైవ మార్గమున పయనిస్తూ దేవాలయ సంస్కృతికి ఊతమిచ్చు తరుణములో అల్లముడు ఆతనిని సన్మార్గములో పయనింపజేయుటకై దేహాలయ సంస్కృతి యొక్క విశిష్టతను తెలియజెప్పెను. ఇష్టలింగ ప్రాణలింగ భావలింగములని యెడు త్రిలింగముల రహస్యములను తెలియజెప్పి వీటి అవాంతర భేదములైన ఆచార లింగ, గురులింగ, శివలింగ, చరలింగ, ప్రసాదలింగ, మహాలింగముల నెలవులను ఉపాసనా పద్ధతులను విశదీకరించెను. లింగ ధర్మోన్ముఖుని గావించెను. నాథ సాంప్రదాయములో సిద్ధహస్తుడై అణిమాది సిద్ధులను కైవసము చేసుకొని వజ్రదేహుడై విరాజిల్లే గోరక్ష నాథునికి కించిత్ గర్వోపహతి కలిగెను. దానిని తొలగించి ఆతనిని

ప్రకాశవంతుడిగా జేయుటకై అల్లముడు ప్రయత్నించెను. వాద ప్రతివాదములు జరిగెను. సఫల మనోరథుడయ్యెను. (వివరములకు గౌరన వ్రాసిన నవనాథ చరిత్ర ద్విపద కావ్యమును చూడునది).

కల్యాణ కటకములో బసవేశ్వరుడు చేపట్టిన భక్తి ఉద్యమమును గురించి ఎరిగిన వాడైన ప్రభుదేవుడు బసవణ్ణను సందర్శించు నాకాంక్షతో కల్యాణోన్ముఖుడాయెను. ఈ సందర్భములో ఆతడు నుడివిన నుడువులు ఈ క్రింది వచనములో చూడగలము.

**కల్యాణంబను ప్రమిదయందు భక్తి రసమను తైలమును నింపి**
**ఆచారమను వత్తియందు బసవణ్ణయను జ్యోతి వెలిగించిన**
**మెరసి ప్రకటంబయ్యె శివుని ప్రకాశము**
**ఆ ప్రకాశములో ఒప్పుచు నుండిరయ్యా అసంఖ్యాత భక్తగణంబులు.**
**శివభక్తుడుండు క్షేత్రము, అవిముక్త క్షేత్రంబనుట కల్లయా?**
**శివభక్తుడుండు దేశము పావనంబనుట కల్లయా?**
**గుహేశ్వర లింగ మందు నా పరామారాధ్యుడు**
**సంగన బసవణ్ణ మహిమ జూడుమా సిద్ధరామయ్యా!**

(వివరములకై శూన్య సంపాదనము చూడగలరు).

కల్యాణములో ప్రభుదేవునికి ఘనమైన స్వాగతము లభించినది. బసవేశ్వరుడు తన మహా మందిరములోనికి తీసుకొని వెళ్ళి దాసోహ కార్యక్రమమును నిర్వహించెను. ఈ సందర్భమున బసవణ్ణ భక్తిని ప్రకటితము జేయుటకై ఒక లీలను రచించెనని పాల్కురికి సోమనాథుని బసవ పురాణమువలన తెలియుచున్నది. ఈ కథలోని యదార్థాంశములు ఎట్లుండినను బసవేశ్వరుడు భక్తి భాండారి యనియును జంగమ ప్రాణియనియును ప్రభుదేవుని చేత కీర్తింపబడెను అనునది సత్యము.

**"లింగైక్య సౌఖ్య కేళీలోల భక్తి**
**జంగమ ప్రాణాను సంధాన శక్తి**
**యుభయ ప్రసాద సంయోగోప భుక్తి**
**త్రిభువనంబుల నున్నదే యితరులకు**

(బసవ పురాణము ద్వితీయాశ్వాసము చూడగలరు)

కల్యాణ కటకము నందు భక్తి సద్గోష్టులు అనునిత్యము జరుపబడుచుండెను. యిది ఒక ఆధ్యాత్మిక శాసనసభ (పార్లమెంటు) అని యనవచ్చును. శివశరణులెల్లరు ఈ గోష్టులలో పాల్గొనుచుండిరి. పండిత పామర భేధములు కాని అగ్ర-నిమ్న వర్ణ భేదముగాని, స్త్రీ పురుష వివక్షతగాని ధనిక-పేద భేదములుగాని పొడసూపకుండెను. ప్రజాస్వామిక విలువలు సమతా భావనలు సౌభ్రాతృత్వ అనురాగములు ఈ గోష్టులలో వెల్లివిరియు చుండెను. బసవణ్ణ, చెన్న బసవణ్ణ, మడివాలు మాచయ్య, కిన్నెర బ్రహ్మయ్య, మొదలగు అగ్రశ్రేణి శివశరణులతో పాటుగా సరిసమాన స్థానములలో గూర్చొని యున్న శివశరణులెందరో హృదయ పూర్వకముగా పాల్గొనుచుండిరి. సమగ్రమైన సామాజిక క్రాంతికి వలయు చింతన జరుపబడేది. సామాజిక సమస్యలకు ఆధ్యాత్మిక విలువలను అనుసంధానం చేసి, ప్రజాస్వామిక పద్ధతుల ద్వారా శాంతియుత మార్గములో ఉద్యమించి సమస్యలను పరిష్కరించుకొనే వ్యూహములు ఈ గోష్టులలో రచియింపబడు చుండెడివి. ఈ గోష్టులు నిర్వహింపబడే సభావేదికా భవనమును 'అనుభవ మంటపము' యను పేరుతో పిలువబడేది.

ప్రభుదేవుడు అనుభవ మంటప గోష్టులలో క్రియా శీలకముగా పాల్గొనెను. అనూహ్యమైన రీతిలో ప్రకాశించెను. ఆతని ప్రతిభావ్యుత్పత్తులకు సంభ్రమ చిత్తులైన సభికులు అల్లముడే తమకు మార్గదర్శియని భావింపజొచ్చిరి. దీనిని గ్రహించిన బసవణ్ణ అనుభవ మంటపము యొక్క అధ్యక్ష స్థానమైన శూన్య పీఠమును అధిరోహించమని వేడుకొనెను. అల్లముడు బసవని విజ్ఞాపన మేరకు సర్వజన సమ్మతితో సభాధ్యక్షుడయ్యెను. అల్లముని అధ్యక్షతలో గోష్టుల చేత ప్రభావితులైన శివవరణులు తమతమ సాధనలను సుసంపన్నము చేసుకొనుటకై ఉద్యమించి సఫలమనోరథులై విరాజిల్లిరి. తాము పొందిన అనుభూతులను ప్రకటించుటకై వచనములను రచియించిరి. వీటిని అనుభవ మంటపములో ఆవిష్కరించి అల్లముని ప్రశంసలను పొందిరి.

అనుభవ మంటపమును సందర్శించుటకై అనేకులు విచ్చేయు చుండిరి. వీరెల్లరు దేశములోని నలుమూలల నుండి వచ్చి చేరినవారే. యిట్టివారిలో అక్క మహాదేవి ఒకానొక ప్రముఖ ఆధ్యాత్మిక వచన రచనా సిద్ధహస్తురాలు. ఈమె నిత్య వైరాగ్యమూర్తియై యుండుటచే వస్త్రాదులను విసర్జించి కేశములే అంబరములు

కాగా కేశాంబర ధారియై తిరుగాడుటచే శివశరణులకు ఆమోదయోగ్యురాలై యుండేదికాదు. అనుభవ మంటపములోనికి ప్రవేశము లభించలేదు. ఈమె అనేక పరీక్షల నెదుర్కొనవలసి వచ్చి యుండెను. యిట్టి పరీక్షలు నిర్వహించిన వాడే మన ప్రభుదేవుడు. వీరిరువురి మధ్య కొనసాగిన సంభాషణలు ఆధ్యాత్మిక రత్నములు కుప్పలు తెప్పలుగా ప్రకాశించుచుండెను. చిట్ట చివరకు మహాదేవి అన్ని పరీక్షలలో నుత్తీర్ణురాలయి అనుభవ మంటపములో సభ్యురాలయ్యెను.

అల్లముని యొక్క ఆధ్యాత్మిక గమనము కల్యాణితో ఆగిపోలేదు. అతడు అప్పుడప్పుడు కల్యాణిని వదిలి అజ్ఞాత ప్రదేశములకు వెళ్ళి అక్కడి అజ్ఞానుల యొక్క మానసిక దౌర్భల్యములను రూపుమాపి జ్ఞానోపదేశమును చేసి తిరిగి వచ్చెడివారు. ఈ విధముగా కొన్ని సంవత్సరములు గడచిపోయినవి. కల్యాణక్రాంతి ఘటిల్లు సమయమునకు అతి సమీప కాలములోనే ప్రభుదేవుడు కల్యాణ పట్టణమును వదిలి శ్రీగిరిలోని కదళీవనమును జొచ్చెను. తన శేష జీవితమును గడిపి లింగాంగ సామరస్యమును పొందెను. అయితే అల్లమునికి సంబంధించిన చారిత్ర్యాత్మక అవశేషములేవియును లభించుట లేదు. యివి కనుమరుగై పోయినవి. పరిశోధకులు సంశోధన సలిపి వీటిని కనుగొనవలసిన ఆవశ్యకత ఎంతైనా కలదు.

**వచనముల విశిష్టత :**

అల్లముని వచనములకు గల ప్రాముఖ్యత అనన్యసామాన్యమైనది. శివశరణులెల్లరు వీటి విశిష్టతను ముక్త కంఠముతో కొనియాడిరి. ఈ వచనముల యందలి అంశముల నాణ్యత అల్లముని ఆలోచనా ధోరణిలోని ప్రత్యేకత ఈతని అనుభవములో నెలకొని యున్న లోతుపాతులు ఈయన ప్రయోగించిన భాష, ఈతడు చూపిన దృష్టాంతములు ఆశ్చర్య జనకములు. ఈతని వచనముల యొక్క విశిష్టతను తులనాత్మకముగా పరిశీలించిన ఒక శివశరణుడు ఈ క్రింది విధముగా నుడివెను.

**"ఆద్యుల అరువై వచనములకన్న**
**దండనాయకుని ఇరువై వచనములు మిన్న**
**దండనాయకుని ఇరువై వచనములకన్న**

ప్రభుదేవుని పదివచనములు మిన్న"

(చెన్నబసవన్న)

చెన్న బసవణ్ణ వచనములో నుడివిన మాటలు పూర్ణ సత్యములు. చెన్న బసవణ్ణతో విభేధించిన వాళ్ళు కనిపించరు. దీనికి గల కారణము సుస్పష్టమైనది. అల్లముని యొక్క ఆధ్యాత్మిక ఔన్నత్యమును ప్రశ్నించే ఆస్కారము లేదు. అతని భావ ప్రకటన ఎంతో ప్రకాశమానముగా గోచరించును. ఇది అతని మాటలలోనే గాంచుదుము గావుత.

**"పలుకే జ్యోతిర్లింగము. స్వరమనునది పరతత్త్వము.**
**తాళోష్ఠ సంపుటియనునదె నాదబిందు కళాతీతము.**
***గుహేశ్వరుని శరణులు పలికి సూతకులుగారు చూడుమా"***

(చూడండి - శూన్యసంపాదనము)

ఈ వచనములోని అంశములను సుస్పష్టము చేస్తూ అల్లముడు మరొక వచనమును చెప్పెను. గమనించండి.

"తన్ను తానెరిగిన పలుకంతా తత్త్వంబు జూడుమా, తన్ను తామరచిన పలుకంతా మాయజూడుమా, ఎరిగి మరచిన శివయోగి శబ్దంబెల్ల ఉపదేశంబు గాక భిన్నమున్నదె?, నీ మనసు నందున్న శోక శమనమునకు అనునయము పలికిన, నా మనమందు దోషంబు లేదు తల్లీ : మా గుహేశ్వరుడు లింగమునకు నీవే కారుణ్యపు శిశువైతివి గాన నోరు తెరచితి దాని భిన్నమున్నదె పిచ్చిదాన?

(వివరములకై శూన్య సంపాదనము చూడవలెను)

అల్లముడు తనను తానెరిగినవాడు. అందుచేత అతని వచనములలో పరతత్త్వము తొణికిసలాడు చుండును. ఎరిగిన వాడె శరణుడు మరచిన వాడె మానవుడు అనునది జగమెరిగిన సత్యము. మానవులు వ్రాయు పద్యగద్యాది కృతులలో పరతత్త్వ భావనలు అల్పముగా నుండును. లౌకిక భావనలకే విశేష ప్రాధాన్యత. ఇష్టదైవమును వర్ణించుట అతని లీలలను గోరంతను కొండంతలు చేసి చూపించుట. అతని పుత్రమిత్ర కళత్రముల గాథలను తెలియజెప్పుట స్వీయ దైన్యమును నివేదించుట,

తన్నివారణార్థమూ కామ్యములను గోరుట మొదలగునవి మానవ కృతులలో యుండు అంశములు. పౌరాణిక పురుషులను కథానాయకులుగా చేసి వ్రాయబడిన కావ్యాలు ఎన్నోగలవు. యజ్ఞయాగాది వైదిక కర్మలను, వ్రత నియమాది పౌరాణిక అంశములను పిండ ప్రదానాది కర్మ కాండలను తీర్థ క్షేత్ర మహిమలను దెలుపు కృతులు కొకొల్లలు. ఈ అంశములేవియును అల్లముని వచనములలో గోచరించవు. ఆతనికి విగ్రహారాధన యెడల ఆసక్తి లేదు. సాకార బ్రహ్మ గురించిన ఉపాసనా నిరర్థకమని భావించిన వాడగుటచే పౌరాణికాంశములకు ప్రాముఖ్యత నివ్వడు. కర్మకాండ కర్మబంధమును పెంచునే గాని త్రుంచదని నమ్ముటచేత దానికి ప్రాముఖ్యత నివ్వడు. అతని యొక్క దృష్టి అంతర్లింగాను సంధానముపై నెలకొని యుండుట చేత ఆతని వచనములలో యౌగికాంశములు అధికముగా నుండును. ఈ యోగము ఒక ప్రత్యేకమైన యోగము. అష్టాంగ యోగముతోగాని- రాజయోగముతోగాని - హఠయోగముతోగాని పోల్చదగినది కాదు. అల్లముని వచనాలలో కేవలము శివయోగమే గోచరించును. శివయోగ సమాధియే శివయోగుల లక్ష్యమై యుండును.

శివయోగమును వివరించుటకై అల్లముడు ఉపయోగించిన పారిభాషిక పదములు చిత్రాతి చిత్రముగా నుండును. సామాన్యులకివి అగమ్య గోచరములు. అసామాన్యులు గూడ అయోమయ పరిస్థితికి గుఱియయ్యే అవకాశము గలదు. ఈ కారణముచేత వ్యాఖ్యాతలు వీటిని వ్యాఖ్యానించుటకు సాహసించరు. మర్మ గర్భిత వచనములని భావింతురు.

"అజ్ఞానమనే ఊయెల్లో జ్ఞానమనే శిశువును పడుకోబెట్టి సకల వేదశాస్త్రమనే తాడును గట్టి, పట్టి ఊపి జోలపాడుతూ ఉంది భ్రాంతి అనే తల్లి ఊయెల ముక్కలై, తాడు తెగి జోల ఆగితేగాని గుహేశ్వరుడనే లింగాన్ని చూడలేము"

(వివరములకై "బసవ పథం" త్రైమాసిక పత్రిక ఫిబ్రవరి, ఏప్రిల్- 2006 నందలి ఆచార్య జి.ఎస్. మోహన్ వ్యాసము చూడగలరు).

జ్ఞాన సముపార్జనకై సాధకుడు చతుర్వేదములను సర్వోపనిషత్తులను - బ్రహ్మ సూత్రములను భారత రామాయణాది కావ్యములు, మనుస్మృతి, యాజ్ఞవల్క్యస్మృతులను ఆశ్రయించాలనే వాదమొకటిగలదు. ఈ వాదమును ఉపనిషద్బ్రహ్మ వాదమని యందురు. ద్వైతాద్వైత విశిష్టాద్వైతములను ప్రతిపాదించిన

త్రిమతాచార్యుల కృతులు ఈ కోవకు చెందినవి. వీరి అనుయాయులు ఎన్నో కృతులను వెలువరించిరి. అయితే యిట్టి జ్ఞానము వలన శివ పరతత్వము గోచరించదని తెలుపుటకై అల్లముడు పై వచనమును రచియించెను. శాస్త్ర జన్య జ్ఞానము శాశ్వత తత్వమును తెలుపజాలదు. శివతత్వము వేదాతీతమైనది. శాస్త్రములకు నందదు. పురాణములకు చిక్కదు. ఉపనిషత్తులలో నిమిడి యుండదు. బ్రహ్మ సూత్రములలో ప్రభవించదు. వీటిని ప్రక్కకునెట్టి గురూపదిష్ట మార్గమున శివయోగ సాధన చేయవలెను. శివుడు భావగతుడై గోచరించును. ఈ విధముగా శివతత్వము అనుభవైక వేద్యమని తెలుసుకోగలరు. ఈ అభిమతమే శివశరణులలో నెలకొని యున్నదని గ్రహించగలరు. అల్లముడు సూచించిన మార్గములో శివయోగులైన వారు ఎందరో గలరు. వీరిలో తెలుగునాట ఖ్యాతి గాంచిన శివయోగి వేమన ముఖ్యుడని తెలియుచున్నది. ఈ విషయమును వివరించే వేమన పద్యముల గమనించుడు:

**కుక్క తిన్నవాడు గురులింగజంగముడు**
**పంది తిన్నవాడు పరమయోగి**
**ఏనుగు తిన్నవాడు ఎంత సుజ్ఞానిరా**
**విశ్వదాభిరామ వినురవేమ!**

**బ్రహ్మ చంపి విష్ణు భాగంబులో కలిపి**
**విష్ణు జంపి శివుని వెలయగల్పి**
**శివుని చంపి తాను శివయోగి కావలె**
**విశ్వదాభిరామ వినురవేమ!**

**ప్రభుదేవుని కావ్యదృష్టి :**

ప్రభుదేవుని వచనములను పరస్పర సంబంధములేని భావ ఖండికలుగా చూసే దృక్కోణమొకటి గలదు. బసవ సమితి ప్రకటించే వచనాలలోను, యూనివర్శిటీలో పనిచేసే ఆచార్యులు పరిష్కరించిన వచనాలలోను ఈ దృష్టి గోచరిస్తుంది. వీరశైవేతరులు చేపట్టు వచన పరిశీలనలు కూడా యిట్టివే. బాదాల రామయ్యగారు తన బసవేశ్వర వచనములు సమగ్ర సమీక్షయను గ్రంథములో ఈ కోణమును

ఆవిష్కరిస్తూ వచనాలన్నియును భావ ఖండికలనియును, వచనకారుడు పొందిన భావావేశమే వచన రూపమును పొందినదనియును వీటికి సిద్ధాన్త నేపథ్యము లేదనియును వివరించిరి.

ఈ కోణమునకు విరుద్ధమైన కోణము మరొకటి గలదు. అది షట్థ్సల సిద్ధాన్త కోణము. షట్థ్సల సిద్ధాంతములోని సూత్రాలను వీరశైవ మతములోని ఆచారములను, వీరశైవధర్మానుయాయుల శీలములను మరియు వీరశైవ ధర్మమునకు కాయము అనదగిన అష్టావరణములను భావ చక్రముగా గైకొని రచియింపబడినవే ఆ వచనములు.

ఇది యిటులుండగా కొందరు సామాజిక అంశములకు మాత్రవే ప్రాముఖ్యతనిస్తూ మత సాంప్రదాయ విషయములను విస్మరించే దృక్కోణమును ఆవిష్కరించుచున్నారు. అల్లముని వచనములు ప్రాథమికముగా మత సంబంధమైనవే. షట్థ్సలాలకు సంబంధించినవని అతని వచనములలో గోచరించే వర్గీకరణ తెలియజేయుచున్నది. ఈ సత్యమును విస్మరించే ప్రయత్నము అంగీకార యోగ్యమైనది గాదు. అల్లముడు వ్రాసిన వచనములను అతడు వ్రాసిన క్రమములోనే పరిశీలించవలెను. అప్పుడు ఆతని హృదయము ఆవిష్కృతమవుతుంది. ఇట్లు గాని యెడల అల్లముని వచనములలోని పూర్ణ సత్యము గోచరించదు. అంతేగాదు ఒక వచనమునకు మరొక వచనము విరుద్ధముగా యున్నట్లు కనబడును. ఉదాహరణకు తెలియజేయాలంటే భక్త స్థలములో చెప్పిన అంశమును ఐక్య స్థలములో చెప్పిన అంశములకు పొంతన ఉండదు. ఇది సహృదయులు గ్రహింతురు గాత. షట్థ్సల వచనములను ఒక కావ్యముగ భావించుటకు అవకాశము కలదు. యిది సామాన్యులకు గోచరించని అంశము. కారణ మేమనగా దీనిలో కథాంశము కథానాయకుడు ప్రతి నాయకుడు ఆశ్వాస వర్గీకరణ అలంకార ప్రయోగములు, కళాత్మక వర్ణన నవరసపోషణ ఇత్యాదులు లేవనేవారు గలరు. ఈ అభిమతములో పూర్ణ సత్యము గోచరించదు. శివశరణులెల్లరు కృత్రి మత్వమునకు వ్యతిరేకులు. అలంకారాదులు వారికి నప్పదు. వర్ణనలు నివార్యములని యెంతురు. రస పోషణ వలన మాయ విజృంభించునని విషయ లోలత్వము పెరుగునని నమ్మినవారు. అయితే కావ్యమంటే వర్ణణాదులు కావనియు లోక కల్యాణము నాశించి చేయు

సాహిత్య కృషిని కావ్యముగా భావించవలెనను కోణములో ఆలోచించిన అల్లముని వచన రచన ఒక గొప్ప ఆధ్యాత్మిక కావ్యమని చెప్పక తప్పదు.

అల్లముని దృష్టిలో కథానాయకుడు శివుడే. అయితే యితడు పౌరాణికులు చెప్పు లక్షణములు గల్గిన శివుడు కాదు. జటాజూటము చంద్రరేఖ, నీలకంఠము, సర్పాభరణము, సతీసాంగత్యము మొదలగునవి ఈతనికుండవు. మాయా సాంగత్యము చేత ప్రవృత్తి మార్గములో పయనించేవాడు అవిద్యచేత పీడితుడై తాను శివుడను భావమును విస్మరించినవాడు. నిష్కళాతత్వమును వీడిన సకలుడు. కాలాతీతుడను భావమును విస్మరించిన కాల బంధితుడు. రాగ ద్వేషములకు లోనైనవాడు. కార్య కారణ సంబంధాదులచే ప్రభావమునకు గురియైన వాడు. పాంచ భౌతిక శరీరమును ధరించినవాడు. మనో బుద్ధి అహంకారములచే బాధింపబడేవాడు. క్లుప్తంగా చెప్పాలంటే ప్రవృత్తి మార్గములో పయనిస్తూ పయనిస్తూ జీవుడై నిలిచిన శివుడు. యితడు దేవ తిర్యగ్మనుష్యాది నానా రూపములో వ్యవస్థీకృతుడగుచున్నాడు. ఎనబది నాల్గు లక్షల యోనులలో నుండి పుట్టి పెరిగి భవ బాధలను అనుభవించుచున్నాడు. జనన మరణ చక్ర బంధములో యిరికి తిరుగాడుచున్నాడు. జరారోగాదులచే పీడితుడగుచున్నాడు. కాయ వికారములతోను, మనో వికారములతోను బాధితుడై నిత్యదుఃఖియై జీవించుచున్నాడు. కామక్రోధమోహలోభ మద మాత్సర్యములే ప్రతి నాయకులు. ప్రతి నాయకులకు బలమును చేకూర్చేది 'మాయ'. ఈ మాయ ఎవరో కాదు. త్రిగుణాతీతమైన స్థితిలో శివుని సరసన యుండే శక్తియే.

### కావ్య లక్ష్యము

భవబాధలకు గురియై భవిగా జీవనము కొనసాగిస్తున్న జీవుని ఉద్ధరించుటకు వలయు మార్గమును చూపుటయే కావ్య లక్ష్యమై యున్నది. యిచట మనము లోకములో ప్రచారములోనున్న తరుణోపాయములను స్మరించిన యెడల భక్తి జ్ఞాన వైరాగ్యములే ముక్తినిచ్చు మార్గములని తెలియవచ్చుచున్నది. అల్లముడు సూచించిన మార్గము గూడ వీటికంటే భిన్నమైనది కాదని తెలిపేవారు గలరు. కాని అది సత్యముకాదు. అల్లముడు చూపిన భక్తి మార్గమునకు ఒక ప్రత్యేకత కలదు.

నిఘంటువు అర్ధములో వివరించే భక్తి కంటే భిన్నమైనది. భక్తియనగా సేవ అనునదే నిఘంటువుల వివరణగా దోచుచున్నది. ఈ అర్థమునే స్వీకరించి కొందరు కవులు కేవలము భక్తి వలన ముక్తిని పొందవచ్చని తెలుపుటకై కావ్యములను రచించినారు. మహాకవి దూర్జటి రచించిన శ్రీకాళహస్తీ మహాత్యము. శ్రీనాథుని శివరాత్రి మహాత్యము, తెనాలిరామకృష్ణ కవి విరచిత పాండురంగ మహాత్యము, శ్రీకృష్ణ దేవరాయలు రచించిన ఆముక్తమాల్యద మొదలగునవి ఈ కోవకు చెందినవే. కన్నప్ప ముగ్ధ భక్తి అరవై ముగ్గురు పురాతనుల అంకిత భక్తి, మార్కండేయుని కామ్యభక్తి మొదలగునవి కావ్య వస్తువులయినవి. అల్లముడు వివరించిన భక్తి యిట్టిది కాదు. దీని స్వభావమును వివరించు క్రింది నుడువుల గనుడు.

ప్రమిద గలదు – వత్తి గలదు – తైలము లేకుండిన దీపమును వెలిగించుట ఎట్టులయ్యా! గురువు గలదు, లింగము గలదు, శిష్యునికి జ్ఞానము లేకుండిన భక్తి కలుగుట ఎట్టులయ్య!

పై వచనమును బట్టి చూచిన అల్లముని ప్రకారము జ్ఞానమే భక్తికి ప్రాణప్రదమైనది. జ్ఞాన విశిష్టమైన భక్తి లక్ష్యమును సాధించుటకు ఉపకరించును అని గ్రహించగలరు. యిట్టి జ్ఞానమునే తన వచనములలో విస్తరించి చెప్పెను.

**కావ్య వస్తువు :**

అల్లముడు వివరించిన జ్ఞానము శరణేతరుల సాహిత్యములో వివరింపబడే జ్ఞానము వంటిది కాదు. వస్తువుజ్ఞానము కాదు. ఆత్మజ్ఞానము గాదు. భ్రమకు లోనుజేసే కేవలాద్వైత జ్ఞానము కాదు. ఈ జ్ఞానము వేదాంతీతమైనది. శాస్త్రములకు నందనిది. శాస్త్రజ్ఞులు తెలుసుకొనగల్గినది కాదు. అల్లముడు వివరించన జ్ఞానము అంగ విజ్ఞానము. యిచట అంగమనగా! నిఘంటువులు తెలుపు అర్ధములో అవగతము చేసుకొనబడే శరీరాదులు గావు. "అమతి గచ్ఛతి ఇతి అంగమ్" అనే మగ్గెయ్య మాయిదేవుని నిర్వచనము ప్రకారము సూచితమైనది. అంగము యనునది ఒక ఆధ్యాత్మిక ఉపాధి. కోట్లాది జన్మలను దాల్చిన పిదప, భవి పూర్వజన్మలలో సంపాదించిన సంస్కార ఫలితముగా నాస్తికభావములను వదలి ఆస్తికుడై శివుడు కలడనే జ్ఞానమును పొందుచున్నాడు. ఈ స్థితిలో యితడు పిండుడు

అనబడుచున్నాడు. పిండుడు శివునికి తనకు గల అవినా భావ సంబంధమును ఎరిగినవాడై పిండజ్ఞాని యగుచున్నాడు. పిండ జ్ఞాని మాయా విలాస వైచిత్రిని ఎరిగిన వాడై సాంసారిక విషయముల యెడ అనూహ్య బుద్ధిని పొంది సంసార నిరాసక్తుడగుచున్నాడు. భవిత్వమును వదిలించుకొనుటకై సద్గురు నాశ్రయించి శుశ్రూషను జేయును. గురు కారుణ్యమును పొందును. దీక్షా సంస్కారము వలన పొంది గురుకర సంజాతుడగుచున్నాడు. నివృత్తి మార్గములో పయనించుటకై కావలసిన అర్హతను పొందుచున్నాడు. యిదియే అతని ఆయత్తమగుచున్నది. ఆయత్తము వలన ఆతడు అంగుడగుచున్నాడు. సంక్షేపముగ జెప్పవలెననిన నివృత్తి మార్గములో పయనించే సాధకుడు. అంగస్థల నివాసి అగుచున్నాడు. స్థలమనగా పరబ్రహ్మ వాచ్యమే.

'స్థీయతే లీయతే యత్ర జగదేతత్ చరాచరమ్ స్థలమితి' అని నిర్వచనము ప్రకారము స్థలము పరతత్వమునకు సంబంధించిన యంశము. ఎచ్చట చరాచర ప్రపంచము లీనమై యుండునో అదియే స్థలమని గ్రహించవలెను.

అంగస్థలములు ఆరని అల్లముని వచనముల వలన తెలియుచున్నది. అవి భక్త స్థలము, మహేశ స్థలము, ప్రసాది స్థలము, ప్రాణలింగి స్థలము, శరణ స్థలము మరియు నైక్య స్థలము. ఈ స్థలములలో సాధన చేసే అంగునికి సహకారమును అందించుటకై శివశక్తి భక్తి స్వరూపమును దాల్చుచున్నది. జీవుని రూపములోనున్న శివుని, భక్తి స్వరూపమునందున్నశక్తి సేవించుననునది గ్రాహ్యము. ఈ భక్తి స్వరూప స్వభావములు ఒకే విధముగా నుండవు. భక్తి స్థలములో భక్తి శ్రద్ధా స్వరూపమును దాల్చును. మహేశ్వర స్థలములో యిది నిష్ఠా స్వరూపియగును. యిదే విధముగా ప్రసాది, ప్రాణలింగి, శరణ, ఐక్య స్థలములలో క్రమముగా అవధాన, అనుభవ, ఆనంద, సమరస, స్వరూపములను పొందుచున్నది. తత్ఫలితంగా సాధకుని భక్త్యైక క్రియలలో మార్పులు కలుగుచున్నవి. భక్తి స్థలములో నుండే ధర్మములు వేరు. మహేశ స్థలములో నుండే ధర్మములు వేరు. ఈ విధముగా ఒక్కొక్క స్థలములో ఒక్కొక్క విధమైన ధర్మములు చేపట్టబడుచున్నవి. ఈ ధర్మముల యొక్క స్వరూప స్వభావములనే ప్రభుదేవుడు తన వచనములలో సవివరముగా వివరించెను. ఈ వివరణలకై ఆధారములు ఏతంత్ర శాస్త్రములో కలవని భావింపవలదు. ప్రభువు

తన స్వాయత్తములో పొందిన జ్ఞానమునే వివరించి చెప్పెనని గ్రహింపదగును.

1. భక్త స్థలము : వచనము సంఖ్య 1 నుండి 112 వరకు
2. మహేశ స్థలము : వచనము 113 నుండి 156 వరకు
3. ప్రసాది స్థలము : వచనము 157 నుండి 163 వరకు
4. ప్రాణలింగి స్థలము : వచనము 164 నుండి 310 వరకు
5. శరణ స్థలము : వచనము 311 నుండి 605 వరకు
6. ఐక్యస్థలము : వచనము 606 నుండి 694 వరకు

ఈ సంపుటములో 229 వచనములు మాత్రమే కలవు. మరో మాటలో చెప్పాలంటే ప్రాణలింగి స్థలములో కొంతభాగము వరకే కలదు. మిగిలిన వచనములను మున్ముందు సంపుటములలో చూడగలరు.

**అల్లముడు ప్రతిపాదించిన లింగతత్వము**

పౌరాణిక భావములకు ప్రాధాన్యత నిచ్చేవారు లింగమును సాకార శివుని ప్రతిరూపముగా నెంచి పూజింతురు. ఈ లింగములు అనేక రకములుగా నున్నవి. వీటిలో కొన్ని స్వయంభూః లింగములు కాగా మరికొన్ని ప్రతిష్ఠిత లింగములు. స్వయంభూః లింగములనగా ప్రకృతి సిద్ధముగా ఏర్పడిన లింగరూపాలు. కొలనుపాకలోని శ్రీ సోమేశ్వర లింగమును ఉదాహరణగా స్వీకరించవచ్చును. ప్రతిష్ఠిత లింగములు దేవతల చేతనో, రాక్షసాదుల చేతనో, ఋషుల చేతనో, రాజుల చేతనో ప్రతిష్ఠితమైనవి. ఈ లింగాలను గురించిన మరియొక వర్గీకరణ గలదు. జ్యోతిర్లింగములు, సామాన్య లింగములు. జ్యోతిర్లింగములు పన్నెండు గలవనే నమ్మకము కొనసాగుచున్నది.

అల్లముడు పై భావమును తిరస్కరించినట్టుగా తోచుచున్నది. ఆతని ఈ రెండు వచనములు క్రింద చూపబడుచున్నవి. గనుడి.

**"రాయి ఇల్లు జేసి, రాయిని దేవుని జేసి,**
**ఆ రాయి రాయిమీద పడిన దేవుడెక్కడ పోయెనోయ్?**
**లింగ ప్రతిష్ఠ చేసిన వారికి నాయక నరకంబు గుహేశ్వరా!**

మరియు

**దేహంబె దేగులమై యుండగా, వేరే మరి దేవాలయం బేటికయ్యా?**
**ప్రాణమే లింగమై యుండ, మరి వేరే లింగమెందుకయ్యా?**
**చెప్పువారు లేరు. వినువారు లేరు.**
***గుహేశ్వరా నీవు రాయియైతే నేనేమగుదునయ్యా?***

(వివరములకై చూడుడు: శూన్య సంపాదవము)

లింగమును గురించిన మరొక భావన ప్రచారములో గలదు. ఈ భావమునకు జన్మదాతలు ద్రవిడ దేశపు శుద్ధశైవులు. నయనార్లుగా పిలువబడే వీరే ఆకారమునకే ప్రాముఖ్యత నిస్తూ లింగకారములో నున్న వివిధ వస్తువులను భజియించిరి. దన్యత పొందితిమని భావించుకొనిరి. "యద్భావం తద్భవతి" అనునది ఈ ఆచరణల వెనుక గల సూత్రము. దీనిని కూడ అల్లముడు అంగీకరించలేదు. ఈ క్రింది వచనమును గనుడి.

**"అంగన చన్ను లింగమా? కొలత సేరు లింగమా?**
**ఊడిన కత్తి లింగమా? మేకపెంటిక లింగమా?**
**మెచ్చేరా ప్రమథులు, మెచ్చేరా? పురాతనులు మీ భక్తులు**
**భావ భ్రమలు తొలగి గుహేశ్వరా**
**మీయందు అనాది సంసిద్ధమైన జంగమ**
**మెరిగినవాడు బసవన్న యొక్కడే'**

(వచనము 439 బ.సమితి)

అల్లముని దృష్టిలో లింగమనగా విశ్వవ్యాప్త, విశ్వప్రేరక, విశ్వైక హేతువు అయిన విశ్వ చైతన్యమే. ఈ చైతన్యమును గురించి ప్రభువు ఈ క్రింది విధముగా తన వచనంలో వివరించాడు.

**"తనువులో నుండి, తనువుకాధారమై తనువు నంటక**
**తనువును వెలిగించే తీరును చూడుమా**
**వెలుగుకే వెలుగై వెలిగే తీరును చూడుమా**

*పరమ చైతన్య నిరాళ గుహేశ్వర లింగాన్ని చూడుమా"*

(485 వచనము బ.సమితి)

విశ్వ చైతన్యముగా వెలుగొందే లింగమును ఆకర్షించి శ్రీగురువు శిష్యునియొక్క కరస్థలమున ప్రతిష్టించు చున్నాడు. యిదియే ఇష్ట లింగమనబడుచున్నది. దేహములోనున్న ప్రాణ చైతన్యము చేత అనుసంధానము పొందుటచేత యిది దేహమునకు చైతన్యదాయకమగుచున్నది. దేహము యున్నంత వరకు యిట్టి లింగమును పూజించి తరించాలని అల్లముడు తెలియజెప్పెను, యిదే లింగ రహస్య ధర్మములోని ప్రాథమిక సూత్రమని గ్రహించగలరు.

**అల్లముడు ప్రతిపాదించిన శూన్య తత్త్వము :**

అల్లముడు శూన్య పీఠమును అధిరోహించెనని తెలియుచున్నది. శూన్యమనగా ఏమిటి? అనుదానిని తెలుసుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా గలదు. శూన్యమనగా 'రిక్తము' అనేది సామాన్యార్థము. ఏమియు లేని స్థితిని శూన్యమని అందురు. గణితములో శూన్యమనగా సున్నా. అయితే శరణ పరంపరలో శూన్యమను పదమునకు ఒక ప్రత్యేకమైన అర్థము కలదు.

శూన్యపదమునకు బయలు అను శబ్దము పర్యాయపదముగా ప్రయోగింపబడినది. ఈ బయలు అను శబ్దము కన్నడ మరియు తెలుగు భాషలలో ఒకే విధముగా కలదు. బయలుయనగా ఆకాశమను యర్థములోను చూడబడుచున్నది. యిదియును సరియైన అర్థముగాదు. షట్‌స్థల సిద్ధాన్తము ప్రకారము సాధకుడు ఐక్య స్థలములో సాధన చేసిన పిదప సఫలీకృత యత్నము గలవాడై లింగములో ఐక్యమగుచున్నాడు. ఈ ఐక్యమునే లింగాంగ సంయోగమని అందురు.

సిద్ధాంత పరంగా ఆరు అంగ స్థలములు గలవు. అదే విధంగా ఆరులింగ స్థలములు గలవు. అంగస్థలములు జీవునికి సంబంధించినవి కాగా లింగస్థలములు పరశివతత్త్వమునకు నెలవులు. అంగస్థలములు యింతకు క్రితమే వివరింపబడినవి. లింగ స్థలములేవనగా?

1. ఆచార లింగము

2. గురులింగము
3. శివలింగము
4. చరలింగము లేదా జంగమ లింగము
5. ప్రసాద లింగము
6. మహాలింగము

యివి ఉండే నెలవులు క్రమముగా 1. మూలాధార చక్రము, 2. స్వాధిష్ఠాన చక్రము 3. మణిపూరక చక్రము 4. అనాహత చక్రము 5. విశుద్ధ చక్రము మరియు ఆజ్ఞా చక్రము.

అంగస్థలములు లింగ స్థలములో లీనమై నిశ్శేషమగుటయే లింగాంగ సామరస్యము. ఈ స్థితిని అల్లముడు క్రింది వచనములో వివరించెను.

**"కర్పూరపు గుట్టకు నిప్పంటితే బొగ్గు మిగులునా?**
**మంచు శివాలయానికి ఎండ కలశముంటుందా?**
**నిప్పుల కొండపైకి లక్క బాణం విసిరితే**
**మళ్ళీ ఆ బాణం కనగలమా?**
**గుహేశ్వరుడను లింగమును తెలిసి**
***ఇతరము తలవగలమా?***

(బసవ సమితివారి 'వచనము' నుండి)

లింగాంగ సామరస్యమును పొందిన వాడు స్వయంగా లింగమై విరాజిల్లుచున్నాడు. యిట్టి వానిని శూన్య స్థల నివాసియని అందురు. శూన్యమనగా తెలిసికొనుటకు ఏమియులేని స్థితి. తెలుసుకొనువాడు లేని స్థితి. తెలిసికోదగిన అంశములేని స్థితి. అదే విధముగా ఈ స్థితిలో నున్నవాడు స్వయంగా శివుడని భావింపబడినది. శివుడు కైవల్యావస్థలో ఉండునట్టి స్థితి యిది. సర్వజగత్తు లింగములో లీనమై యుండును. 'సర్వం లింగాంతర్గతం విశ్వమ్', 'లింగబాహ్యం పరం నాస్తి' అనేవి లింగధర్మోక్తులు. శక్తియు గూడ లింగములో లీనమై యుండును. లింగములో లీనముగాని దేదియును ఉండదు. లింగము నిరాకార నిరంజన

స్వరూపమై విరాజిల్లును. అయితే యిది సాధకుడు పార్థివ శరీరమును వీడిన పిదప సిద్ధిస్తుందని భావింపవలదు. దేహముండియు దేహాభిమానముండదు. మనస్సు యుండియు అది లింగములో లీనమై యుండును. అంగ వికారములు గాని, ఇంద్రియ వికారములుగాని, మనో వికారములుగాని, భావ వికారములుగాని ఉండవు. అల్లముడు యిట్టి స్థితిలోనే యుండెనని తెలుపబడినది. ఈ విధంగా యీతడు శూన్యస్థలమును అధిరోహించిన వాడయి చరలింగమై విరాజిల్లెనని గ్రహింపగలరు.

**అల్లముని వ్యక్తిత్వ లక్షణములు**

అల్లముడు వివరించిన షట్థ్సల జ్ఞానమును శ్రద్ధగా పరిశీలించినచో అతని వ్యక్తిత్వము యొక్క ప్రగాఢమైన ముద్ర గోచరించగలదు. అతని వ్యక్తిత్వము యొక్క లక్షణములను గుర్తెరుగుట ఎంతో అవసరము.

అల్లముని యొక్క ఆకారము సకల సన్మంగళ సలక్షణములతో విరాజిల్లుచుండెనని తెలియుచున్నది. అతడు వ్యుప్తకేశుడై యుండెనని సోమనాథుడు తెలిపెను. అతని మంగళాకారమును గాంచిన భక్తులు అతనికి ప్రణమిల్లి తమ భక్తి తత్పరతను చాటుకొనుచుండిరి.

ఆకారపుష్టి గలవారెందరో అంతరంగ శుద్ధిని కోలుపోయి మనో వైకల్యముతో తిరుగుచుండుటను చూడగలము. వీరి నడత వీరి నుడువులు దోష భరితములై యుండుటను గమనించగలము. అల్లముడు యిట్టివాడు కాడు. పరిపూర్ణమైన పరిశుద్ధాంత రంగము గలవాడు. ఆకలి దప్పిక నిద్ర ఇత్యాది కాయవికారములు లేనివాడు. నిర్మలమైన మనస్సు గల్గినవాడు. నిర్మలమైన మనసుతోపాటు ప్రశాంతమైన చిత్తము గలిగిన శాంతమూర్తి. కామక్రోధలోభమోహ మద మాత్సర్యాదులను జయించినవాడు. అష్టమదములను తొలగించుకొని నిరహంకారియై తిరుగాడెవాడు. అతని నడక అతని నుడువులు లోక ప్రసిద్ధములై విరాజిల్లుచుండెను. జ్యోతిర్లింగమువలె విరాజిల్లె యాతని వాక్కులు లోక కల్యాణమును ఆకాంక్షించేవిగా ఉండేవి. నుడువుల నడకల మధ్య భేదములేని త్రికరణ శుద్ధి గల్గినవాడు.

అల్లముడు సమతానుభవమును సంపూర్ణముగా పోషించిన సమదృష్టి గల్గిన ధీశాలి. బుద్ధిమంతుని యెడల ఏ దృష్టి గల్గెనో అదే దృష్టి బుద్ధిహీనుల పట్ల గూడ కల్గియుండెడు వాడు. పసిడికి శిలకు మధ్య అబేధ బుద్దిని పాటించే వైరాగ్య జీవి.

సర్వేంద్రియములపైన సమగ్రమైన నియంత్రణను సాధించిన సంయమీశుడు అల్లముడని తెలియుచున్నది. జ్ఞానేంద్రియములను, కర్మేంద్రియములను తన వశములోనికి తెచ్చుకొనుటకై కావలసిన శక్తిని పొందినవాడు. శమ దమములు గల్గినవాడు. కఠిన శ్రమకు ఓర్చి కార్యసిద్ధిని సాధించుటలో సిద్ధహస్తుడు.

అల్లముడు కర్మలంపటత్వము గల్గినవాడుగాడు. పూర్వోత్తర సంస్కారముల యెడల నిరాసక్తత గల్గినవాడు. కర్మల వలన భవబంధములు పెరుగునని గ్రహించినవాడు. కర్మ సన్యాసమును పాటించిన జ్ఞానయోగి.

అల్లముడు త్రికాలవేదియను ఖ్యాతిని పొందియున్నాడు. దూరదృష్టి గల్గినవాడగుటచేత భవిష్యత్కాలములో సంభవించు ఘటనలను గణనలోనికి తీసుకొని తగిన నిర్ణయములను చేయు నిష్ణాతుడు. అతడు లాంఛన ప్రాయముగా విద్యనభ్యసించలేదు. సకల విద్యా పారంగతునికి ఉండవలసిన లక్షణములన్నియు అల్లమునికి యుండెను. వేద వేదాంగేతిహాసముల నిగూఢ రహస్యములను ఎరిగిన పండితోత్తముడు. తనకుగల పాండిత్యమును ప్రదర్శించుటకు ఉద్యమించే ఉత్సాహము అతనిలో లేశమాత్రమైన ఉండేది కాదని తెలియవచ్చుచున్నది. నిరాడంబరత అనేది అతనికి ఆభరణమై ఉండేదని గ్రహింపదగును.

శరణ సాంప్రదాయము ప్రకారము శరణుడు యిచ్చువాడేగాని అభ్యర్థించేవాడు గాడు. అల్లముడు ఈ నియమమును ఖచ్చితముగా పాటించువాడని తెలియుచున్నది. భక్తులు తనకు సమర్పించు కానుకలను స్వీకరించేవాడు కాదని తెలియుచున్నది.

అభేద బుద్ధిని పాటించుట చాల కష్టము. శత్రువులను మిత్రులను ఒకే విధముగా చూచుట అంత సులభ సాధ్యము గాదు. అదే విధముగా మానావమానముల యెడల అభేదబుద్ధితో ఉండుట కష్టసాధ్యము. కాని అల్లముని వంటి మహానుభావులకు యిట్టి అబేధ బుద్ధి సహజ లక్షణమై యుండెను.

అల్లముని వ్యక్తిత్వ లక్షణములను గాంచి ఆశ్చర్య చకితులైన కవులు ఆతని వ్యక్తిత్వమును శత విధములుగా కీర్తించిరి. యిట్టి కవులలో పాలకుర్కి సోమనాథుడు ఒకడు. ఈ కవి కవితలు గమనార్హములై యున్నవి. గమనించండి.

**"నంత నల్లమ ప్రభు వను సంయమీశుఁ**
**దంత కాంతక మూర్తి యతులిత కీర్తి**
**నిర్వ్యాలితోద్రిక్త దుర్మలుఁడుభయ**
**కర్మనికృంతన కర్మ కర్మఠుడు**
**వైరాగ్య సంసార వర్జితాత్మకుఁడు**
**దూరదృష్టా దృష్ట చారు చర్యుండు దాన ప్రతి గ్రహ హీన వర్తనుఁడు**
**మానావమాన సమాన కీర్తనుఁడు**
**సమలోష్ట కాంచన సమ సుఖదుఃఖ**
**సమమిత్ర శాత్రవ సద్భావనుండు**
**సప్తధాతు మదాది సర్వాంగ గుణవి**
**లుప్త చిత్తుండు సంసుప్తి దూరుండు**
**కాల సంకల్ప వికల్ప మహేంద్ర**
**జాల ప్రపంచ నిర్మూలన శాలి**
**పరమ శివానంద పరవశీ భూతుఁ**
**దురుముక్త కేశయుతోత్తమాంగుండు**
**దివ్యానిమిష సుధాదృష్టి గోచరుఁడు**
***భవ్యుండు గాంధర్వ పండితోత్తముడు"***

అల్లముడు గొప్ప మానవతావాదియని తెలిపే ఆధారము గోచరించుచున్నది. ఈ క్రింది వచనము గనుడి.

"లింగములోన జంగమం, జంగమునిలోన లింగమం, చెరిగి, మరచి, వ్యర్థాలాపములాడి, జంగమాన్ని మరిపొందుటెందు కయ్యా ఆ లింగములోనే జంగముని జూచుకొనుము. లింగార్చనవసరంబున కెదురేగి నమస్కరించి భక్తిని

జేయునాతడే భక్తుడు. ఆ జంగముడింటికి వచ్చిన లింగార్చనము మాని, జంగమంబున కెదురేగి నమస్కరించి భక్తిని జేయునాతడే భక్తుడు. ఆ జంగముడు బయటుండ లింగార్చనము జేయునాతడెట్టి భక్తుడు? జంగముని ఎదుట లింగము చేతియందు బెట్టుకొని, సహ పంక్తిలో కూర్చొని పూజించునాతడు భృత్యాచార ద్రోహి ఆ భక్తునింటికి పోవు జంగముడే అజ్ఞాని. మా గుహేశ్వరుని శరణులతోడ అహంకారము చెందిన వారిని చూడ నే నొల్లనయ్యా సంగన బసవణ్ణా!"

**అల్లముడు పోషించిన సామాజిక, నైతిక విలువలు**

**సమత**

అల్లముని యొక్క దృష్టిలో రెండే రెండు వర్గములు గలవు. మొదటి వర్గము ప్రవృత్తి మార్గములో పయనించేవారు. వీరు పరతత్త్వమును మరచి పలు మార్గములలో పయనిస్తూ భవ బాధలను అనుభవించేవారు. రెండవ వర్గము గురుముఖమున భవ బంధములను తొలగించుకొని లింగధారణ పొంది నివృత్తి మార్గమున పయనించేవారు. వీరిలోని జాతి బేధములు ఎంచకూడదని ప్రభువు తెలియజేసిరి. ఈ విషయమును ధృడపరిచే క్రింది వచనము గనుడి.

**"ఏ జాతియైనా కానీ**
**పురాతనుల చారిత్ర్యంలో నడచి**
**గురులింగ జంగములకు అర్థప్రాణ మానాభిమానాల్ని సమర్పించి,**
**అహంకారం వదిలి వేసినట్టి మహాత్ముల ఎంగిలి తమ్మలంఅంటాను,**
**మాసిన ఉడుపులు తొడుగుతాను వారి పాదరక్షలురెంటినీ**
**తలమీద మోసుకొని బ్రదికెదనయ్యా**
**ఆగణాల దాసునికి దాసుణ్ణి నేను**
**జన్మ జన్మాలన్నిటా కూడా గుహేశ్వరా"**

(వచనము 464 బ.సమితి)

జాతి భేదము పొడసూపుటకు గల కారణములనేకములు గలవు. వీటిలో కొన్ని అజ్ఞానము వల్ల ప్రభవిస్తే మరికొన్ని అరిషడ్వర్గముల వల్ల కలుగుతాయి. అవిద్యయే

అజ్ఞానమును కలిగించే ప్రధాన కారకము. అవిద్య వలన శివజీవైక్య భావము దృగ్గోచరము గాదు. తమోగుణము వృద్ధి చెంది జ్ఞానమనే చంద్రునికి అవరోధము కలిగించును. మాయ విజృంభించి అహంకారాదులను కలిగించి మనస్సును మలిన భరితము చేయును. అంతరంగ శుద్ధి కొరవడును. ఈ పరిణామముల ఫలితముగా జీవుడు భేదభావముతో పీడితుడై పరజాతి వారిని దూరము చేయుచున్నాడు. స్వజాతి వారిని అందలమెక్కించుచున్నాడు. వర్ణ వ్యవస్థలో నున్న ఈ ప్రబలసత్యాన్ని గ్రహించలేని స్థితిలో మానవునికి అరిషడ్వర్గములోని మదము ఆవహించి పర పీడనకు ప్రేరేపించుచున్నది. యిట్టి మదగ్రస్తులను ప్రభుదేవుడు ఈ వచనములో నిరసించెను.

**"కుల మదం, పంతాల మదం, విద్యామదం**
**కలవారిని చూపించకురా**
**వారధిరోహించిన పదముల నాకు చూపకురా**
**వారి గర్వ గంభీరతలు నాకు చూపకురా!**
**శమదమాదులు మిగిలి దశముఖములాగి**
**లింగంలో లీనమైన వారిని కాక**
**నాకు చూపించకురా గుహేశ్వరా"**

(వచనము 510 బ.సమితి)

విశ్వమానవ సమానత్వము సిద్ధించాలంటే విశ్వములో నెలకొనియున్న అజ్ఞానమును పారద్రోలాలనేదే ప్రభుదేవుని అభిమతమై యున్నదని గ్రహింపదగును.

స్త్రీ పురుష సమానత్వమనేది సమతలోని మరియొక కోణము. పరంపరానుగత సమాజములో స్త్రీకి స్వతంత్రమైన గుర్తింపు లభించలేదు. ఆమెను ఎవరో ఒక పురుషునితో జోడించి గుర్తింపునిచ్చేవారు. ఆ పురుషునితో ఆమెకున్న సంబంధమే గుర్తింపుకు మూలాధారమై నిలిచేది. కన్నియగా నున్నప్పుడు తండ్రిద్వారా గుర్తింపు లభియించేది. వివాహితయైన పిదప భర్తద్వారా గుర్తింపు పొందేది. భర్త గతించిన పిదపనూ, పిల్లలద్వారా గుర్తింపు పొందేది. యిట్టి భావన పెంపొందుటకు మనుస్మృతి దోహదం చేసింది. అల్లముడు మనుస్మృతిలోని ఈ భావమును తిరస్కరించినాడు. స్త్రీకి స్వతంత్ర్యము కలదనియును అది స్వతఃసిద్ధముగా కొనసాగుననియు

తెలియచేసెను. అక్క మహాదేవితో ఈతడు సలిపిన సంభాషణల్లో ఈ భావములను గాంచగలము. పురుషాధిక్యతను ప్రక్కకు నెట్టి స్త్రీకి స్వతంత్ర్య ప్రతిపత్తి కల్పించిన ఘనులలో అల్లముడు అగ్రగణ్యుడు. పరం పరానుగతమైన సమాజములోనున్న బంధనములను బద్దలు కొట్టుకొని కేశాంబరియై లింగాంగ సామరస్యమును సాధించే రహస్యముల నెరుగుటకై దేశాటనము చేయుచున్న మహాదేవి యొక్క పవిత్రతను గుర్తించిన అల్లముడు ఆమెకు అనుభవ మంటపములో గౌరవప్రదమైన స్థానమునిచ్చెను. ఆ విధముగా స్త్రీ స్వేచ్ఛకు పట్టము గట్టినవాడాయెను. అల్లమ ప్రభు స్త్రీల పట్ల గల భావమును ఈ క్రింది వచనములో గనుడు.

**"తను గుణము నాస్తియై లింగసంగియైనది.**
**మనోగుణము నాస్తియై జ్ఞాన సంగియైనది**
**భావ గుణము నాస్తియై మహాప్రకాశము తానైనది**
**నీవు నేనను భేదము నణచి, మా గుహేశ్వర లింగమందు స్వయం**
**లింగమైన**
**మహాదేవి అక్క నిలువునకు శరణనుచుంటిని".**

మహాదేవితో పాటుగ మరెందరో శివశరణీమణులు అల్లమప్రభు చేత ఉద్ధరింపబడి సర్వతో ముఖ వృద్ధిని పొందిరి. వీరిలో ముక్తాయక్క, లక్కమ్మ ముఖ్యమైనవారు (వివరములకై శూన్య సంపాదనము చూడగలరు).

సమతలోని యింకొక కోణము వయోభేదముల పరిగణన అధిక వయసువారు గౌరవనీయులైన వారనియును, పిన్న వయసువారు అట్టి గౌరవమునకు అర్హులు గారనియును పరిగణింప బడుచుండెడిది. పిన్న వయస్కుడు సమానార్హతలు గలిగి యుండినను సమాన గౌరవమును బొందెడి వాడు గాడు. యిట్టి వివక్షతను ప్రభువు తిరస్కరించిన వాడాయెను. ఈతని దృష్టిలో అర్హతనే మూల్యాంకనకు కొలమానమై యుండవలెను. ఈ భావమును క్రింది వచనములో చూడగలము.

**"పిన్నలైతేనేమి పెద్దలైతేనేమి**
**తెలివికి పిన్నపెద్ద లుంటాయా**
**ఆది అనాదులు లేని నాడు**

అజాండ బ్రహ్మాండ కోటులుదయించక ముందు గుహేశ్వరలింగంలో
నీవొక్కడివే మహాజ్ఞాని వనేది కానవచ్చింది కనుమా చెన్న బసవణ్ణా.
(వచనము 508 బ.సమితి)

**మమత :**

అల్లముడు శివశరణులందరిని ఒక కుటుంబ సభ్యులుగా భావించేవారు. కుటుంబ సభ్యులెల్లరు పరస్పర అనురాగ బద్ధులై తమతమ కష్టసుఖములలో ఒకరు యింకొకరికి బాసటగా నిలుచుటను గాంచగలము. అయితే ప్రాపంచిక కౌటుంబిక వ్యవహారాలలో సంబంధ బాంధవ్యములకు స్వార్థమే పరమావధిగా నిలుస్తుంది. స్వార్థ ప్రయోజనములు ఘర్షణలకు దారి తీయును. తత్ఫలితంగా కౌటుంబిక సంబంధాలు ఛిన్నా భిన్నమై పరస్పర వైషమ్యాలు నెలకొని నిరంతర అశాంతికి ఆస్కారము ఏర్పడుతుంది. అన్నదమ్ముల మధ్య ఆస్థి తగాదాలు. అక్కాచెల్లెళ్ళ మధ్య మాట పట్టింపులు, తండ్రి కొడుకుల మధ్య భావ ఘర్షణలు మొదలగునవి నిత్యమూ సంభవించే ఘటనలు. అయితే ఆధ్యాత్మిక జగత్తులో స్వార్థమునకు తావులేదు. నిస్వార్థమైన బుద్ధితో అనురాగ బంధమును కొనసాగించవలసి యుండును. అల్లముడు ఈ భావనకు ఎంతో ప్రాముఖ్యతను యిచ్చెను. శివశరణులెల్లరు తనవారే అనే భావము వహించి వ్యవహరించెను. వారికి కష్టములు సంభవించినప్పుడు వారిని సందర్శించి అనునయ వాక్యములు బలికి శాంతింపచేసెను. ముక్తాయక్క యను శివశరణి శోక సముద్రములో మునిగిపోయినప్పుడు అల్లముడు పలికిన అనునయ వాక్యములు గమనార్హమైనవి. కుటుంబ పెద్దగా ఒక బావ తన మరదలిని ఏ విధంగా అనునయించి శాంతింపజేయునో అదే విధముగా కార్య నిర్వర్తన చేసెను.

(వివరములకై శూన్య సంపాదనము చూడగలరు)

స్త్రీ, శివశరణీమణులను సంబోధించే సందర్భములో అల్లముడు అమ్మా, అక్కా చెల్లీ అనే శబ్దములను ప్రయోగిస్తూ వారి యెడల తనకు గల గౌరవాభిమానములను వ్యక్తీకరించెను. పురుష పుంగవులను సంబోధించినప్పుడు అన్నా, తండ్రీ, సోదరా' అని శబ్దముల ప్రయోగము చేసెను. ఈ విధంగా అల్లముడు మమతా భావమును వ్యాపింపజేసి శివశరణుల మధ్య సత్సంబంధములను నెలకొల్పెను.

వాద ప్రతివాదములు జరిపిన సందర్భములో ప్రతి వాది యెడల ప్రమోద భావమును వహించుట కుదరని పని. వైషమ్యాలు పొడసూపి శతృత్వ భావనలు విజృంభించి హింసాకాండకు దారితీసే సందర్భములు ఎన్నోగలవు.

(వివరములకై పండితారాధ్య చరిత్రలోని పండితుని ఊర్ధ్వనేత్ర కథనమును చూడగలరు)

అయితే అల్లముని భావము వేరుగా నున్నది. లోకపు నడత కంటెను విరుద్ధముగా నుండును. ప్రతివాది యెడల మమతను ప్రదర్శించిన ఘనకీర్తి అల్లమునికే చెందుతుంది. సిద్ధరామయ్యతో సల్పిన వాదనలోను గోరక్షనాథునితో చేబట్టిన వాదనలోను, వైషమ్యాల సెగ కనిపించదు. భావ సంఘర్షణలే గోచరించును. దురభిమానముయొక్క దుష్ట పరిణామములు దృగ్గోచరములు గావు. అల్లముడు ప్రతివాదులను మమతతో పలుకరించి సరస సల్లాపములు సలిపి వారిని శాంతింపజేసెను. ఈ విధంగా అల్లముడు అనుపమానమైన మమతా మూర్తిగా గోచరిస్తాడు. యిట్టి భావనను ప్రదర్శించుట అంత సులభసాధ్యమైన విషయం కాదు. పౌరాణిక గాథలలో దుష్ట నిర్మూలనకు ప్రాధాన్యతనీయబడినది. దుష్టత్వ సంహారమునకు ఆస్కారము కల్పింపబడలేదు. అల్లముని ప్రకారము దుష్టత్వమునే దునుమవలెను. దుష్టుడిని సజ్జనునిగా మార్చవలెను. భవిని భక్తునిగాజేసి ఆతని స్వస్వరూప ప్రాప్తికి దోహదం చేయవలెను. ఈ అంశమే ఆతని మమతకుగల పరమావధి.

**త్యాగము :**

అల్లముడు సర్వసంగ పరిత్యాగి అనేది జగద్విదితమైన సత్యము. త్యాగబుద్ధిలేనివాడు సంసారములో కొట్టుమిట్టులాడుచు భవ బాధలకు గురియగునని అల్లముని విశ్వాసము. మాయ మానవునికి పలు విధములైన ప్రేరణలు పుట్టించి ధనదాహమును కలిగించును. సంపదను కూడబెట్టుటకై కార్యాచరణను సిద్ధము చేయును. క్రమేపి వ్యక్తి దురాశాపరుడై ధనదాహమనే అగ్నిలో పడిపోయి శలభము వలే మాడి మసియగుచున్నాడు. యిట్టి స్థితిని నివారించుటకై వ్యక్తి కృషి చేయవలసిన ఆవశ్యకత ఎంతో గలదు. అల్లముడు ఈ క్రింది విధముగా ఉద్బోధించెను.

"పసిడి మాయ అందురు
పసిడి మాయ కాదు
పడతి మాయ అందురు
పడతి మాయ కాదు
పుడమి మాయ అందురు
పుడమి మాయ కాదు
మనస్సు ముందటి ఆశయే మాయ
కనుమా గుహేశ్వరా"

(వచనము 72 )

ఈ ప్రబోధములో ఆశయే కీలకమైనదిగా దోచుచున్నది. శరణుడు ఆశను జయించాలంటే తాను గడించిన సంపదను దాసోహ కార్యక్రమములలో వ్యయపరచవలెను. తద్వార ధనముయెడల గల అభిమానము త్యాగము చేసిన వాడగును. బసవేశ్వరునిలో ఈ గుణము ఉండేదనియు ఆతడు తన సంపదనంతా జంగములకు దాసోహార్పణ చేసి ధన్యుడయ్యెననియును. అనునిత్యము లక్షాతొంభై ఆరువేల జంగములు దాసోహమును స్వీకరించు చుండిరనియు పాల్కురికి సోమనాథుని బసవ పురాణము ద్వారా మనకు తెలియుచున్నది.

త్యాగబుద్ధివలన నిత్య వైరాగ్య సంపత్తి వశమగుచున్నది. వైరాగ్య సంపత్తిలేని వానికి లింగాంగ సామరస్యము సిద్ధించదని అల్లముడు నొక్కి చెప్పెను. తనువు, మనస్సు మరియు ధనమును త్యాగము చేయకుండిన యెడల స్వ స్వరూప ప్రాప్తి సిద్ధించదు. తనువును గురుసేవకు, మనస్సును ఇష్ట లింగమునకు ధనమును జంగమునికి సమర్పించవలెనని అల్లముడు సూచించెను. శివ శరణు లెల్లరు తమ తమ వచనములలో ఈ అంశమునే వ్యక్తీకరించిరి.

**యోగము :**

అల్లముడు యోగమనే శబ్దమునకు అనే కార్థములను సూచించెను. వైయక్తిక స్థాయిలో యోగమనగా శివయోగమే. మూలాధారాధి చక్రములలోని ఆచారాది

లింగములను అర్చించి లింగాంగ సామరస్యమును సాధించే ప్రయత్నమే. అయితే సామాజిక విలువగా దీనికొక ప్రత్యేకార్థముగలదు. శివశరణుల సంయోగమే యోగము. అనుభవ మంటపము యనబడే దానిని వేదికగా చేసుకొని అసంఖ్యాకమైన శివశరణులు ఈ యోగ ప్రక్రియలో పాల్గొనేవారు. దీని లక్ష్యము భక్తి సద్గోష్ఠి. భక్తులు తమ తమ అనుభవైక ప్రసంగములలో అనుభవములను వ్యక్తీకరించుచుండిరి. అధ్యక్ష స్థానములో నున్న శరణుడు సమన్వయ కర్తగా వ్యవహరించేవాడు.

భక్త సద్గోష్ఠి ఆధ్యాత్మిక పరమైనది అయినను దీనివలన అనేక సామాజిక ప్రయోజనములు నెరవేరేవి. ప్రాథమికముగా శివశరణులలో పరస్పరమైన అవగాహన పెరుగుటకై అనుభవ గోష్ఠులు ప్రముఖ పాత్రను వహించేవి. సామాజిక సమస్యలెన్నో బహిర్గత మయ్యేడివి. రాజకీయ శక్తుల ప్రతిక్రియలు బయలుబడేవి. ప్రతివాదుల వ్యూహములు తెలియవచ్చేవి. ఈ విధముగా అనుభవ గోష్ఠుల ద్వారా అనేకమైన ప్రయోజనములు సిద్ధించేవి.

**సమయాచార పరంపర :**

అల్లముడు ప్రతిపాదించిన మౌళిక విలువల ద్వారా సామాజిక ప్రక్రియలను సుసంపన్నము చేయాలనే సంకల్పము ప్రభుదేవుని అనుయాయులకు పొడచూపెను. తత్ఫలితముగా ఒక వ్యవస్థీకృత ప్రయత్నము ప్రారంభమయ్యెను. అనేకమైన కార్యక్రమములు చేపట్టబడెను. సిద్ధరాముని వంటి శివవరణులు నేతృత్వము వహించిరి. ఈ ప్రయత్నాల ఫలితంగా ఏర్పడినదే సమయాచార పరంపర.

ఐదుగురు సమయాచార పీఠములు స్థాపింపబడెను. అవి హుబ్లీ , చిత్రదుర్గ, గోకాక్, గదగ్ మరియు కోడంగల్లులో స్థాపింపబడెను. ఈ పీఠముల అధిపతులను సమయ పీఠాధిపతులు అని అందురు. హుబ్లీ పీఠమునకు కుమార సమయమనియు, చిత్రదుర్గ పీఠమునకు మురుఘ సమయమనియును, గదగ్ పీఠమునకు చీలాల సమయమనియును మరియు కోడంగల్ (రంగారెడ్డి జిల్లా) పీఠమునకు కెంపిన సమయమనియును గోకాకు పీఠమును సంపాదనసమయమని పేర్లు కలవని తెలియుచున్నది

ఈ పీఠముల ఆధీనములో కొన్ని వేల శాఖా మఠములు ఏర్పాటు చేయబడినవి. ఈ శాఖామఠములు ఒకనిరంజన చరమూర్తి ఆధీనములో పనిచేయుచున్నవి. సమాయాచార మఠముల క్రియాశీలక ప్రయత్నము వలన అల్లముని కీర్తి దిగంత పరివ్యాప్తమయ్యెను. సాహిత్య రంగములో అనేకమైన కావ్యములు వెలువడినవి. కవులు అల్లముని కథానాయకునిగా చేసి కావ్యములను రచియించిరి. ఈ కావ్యములన్నియును అల్లముని ఒక మహిమాన్విత మహావ్యక్తిగా చిత్రీకరించినవి. పిడపర్తి సోమన ఈతని గాథను పౌరాణికశైలిలో విరచించిరి. యితనికి ఎన్నియో దివ్యశక్తులు గలవని తెలుపుటకై కథలు రచియింపబడినవి. యితర రచయితలు – కవులు గూడ యిదే మార్గము నవలంబించిరి. ఈ ధోరణి ఫలితముగా వీరశైవులలో అల్లముని గురించిన దివ్యభావములు ఎంతోప్రచారమును పొందినది. క్రిందటి తరము వరకు అనేకులు తమతమ సంతానమునకు ప్రభుదేవుని పేరు పెట్టి ధన్యతను బడసిరి. నేటికిని ప్రభుదేవ నామముతో పిలువబడు వ్యక్తులు కొన్ని వేల మంది గలరు. భక్తులు ప్రభుదేవుని చిరస్మరణకై గుళ్లు, గోపురములు, సభామంటపములు నిర్మించిరి. ఈ ప్రదేశాలలో ప్రభువు వచ్చి నివసించెనను ప్రగాఢమైన విశ్వాసమును పెంపొందించుకొనిరి. తార్కాణంగా, తెలంగాణాలోని బోధన్ జిల్లా బొమ్మదేవునిపల్లి శివారునందు శిఖరాలలోని గుట్ట మరియు కల్దుర్కి కోటలోని గుడిని చెప్పవచ్చు. నిరంజన పరంపరవారు నడుపబడు మఠములలో నిత్యాన్న దాసోహము నిర్వహింపబడుటను గమనించగలము. విద్యారంగములో విశేషమైన కృషి చేపట్టబడుచున్నది. అసంఖ్యాకమైన పాఠశాలలు గణనీయమైన సంఖ్యలో కళాశాలలు నిర్వహింపబడుచున్నవి. ప్రజాసంక్షేమమునకు ప్రయత్నములు చేయబడుచున్నవి. యిట్టి ప్రయత్నములన్నియును కర్ణాటక రాష్ట్రములోనే ఎక్కువ సంఖ్యలో జరుపబడుచున్నవనేది విస్మరించరాని విషయము.

**నేటి సమాజానికి అల్లముని సందేశము :**

అల్లముని వచనములలోని భావములు నిత్యనూతనమైనవి. నేటికిని అల్లముని వచనములు సామాజిక సమస్యలను పరిష్కరించే దిశలో వివిధ మార్గాలు. కుల వివక్ష నిర్మూలన, మూఢ నమ్మకముల విస్మరణ, ఏకేశ్వరోపాసన స్త్రీ జన సముద్ధరణ, బలహీన వర్గాల సముద్ధరణ మొదలగు లక్ష్యములు సాధించవలసి యున్నది.

సామాజిక రుగ్మతలను రూపుమాపుటకు అల్లముని వచనములు అమృత గుళికల వంటివి. అన్ని వర్గములకు చెందిన వారు ఈ వచనముల నుండి లబ్ధిని పొందుటకు అవకాశము గలదు.

**వ్యక్తిత్వ వికాసము-అల్లముని వచనములు**

ప్రభుదేవుని వచనాలలోని అంశముల వలన యువత యితోధికమైన లబ్ధిని పొందే అవకాశము గలదు. ఆత్మ విశ్వాసమే వ్యక్తి ప్రగతికి అనంతమైన శక్తిని యిస్తుందనేది అల్లముని జీవిత చరిత్ర వలన తేటతెల్లమగును. శూద్రకుల సంజాతుడైనను శూన్య పీఠమును అధిరోహించిన ఘనత అల్లమునికే దక్కుతుంది. దీనికి గల ప్రధాన హేతువు ఆత్మవిశ్వాసమే. ఆత్మ నిబ్బరత గల్గినవాడు తన జీవన గమనమును తానే శాసించుకొనగలడు. ఉన్నత శిఖరములు అధిరోహించగలడు. అయితే కొందరు నిరాశా నిస్పృహలకు లోనై ప్రయత్నమును చేయకయే పరాజయమును ప్రకటించుచున్నారు. వీరెల్లరుకు అల్లముడు స్ఫూర్తి ప్రదాతయగుచున్నాడు. ఆడంబరత్వమనేది నేటి యువతను పీడిస్తున్న జటిల సమస్య. ఆడంబరమైన జీవితమును కొనసాగించుటకునై అనేకులు ప్రయత్నిస్తున్నారు. నిరాడంబరత్వమే నిర్ణీత లక్ష్యాలను సాధించగలదని అల్లముని వచనముల వలన తెలియుచున్నది. Simple Living - High Thinking అనే నేటి భావమునకు అల్లముని వచనములు దోహదపడుచున్నవి. యువత తన మేధస్సును సుసంపన్నము చేసుకొనవలెను. తన్నిమిత్తమై తన ఆలోచనలకు పదును బెట్టి సాహిత్యమును అధ్యయనము చేయవలయును. అల్లముని వచనములు ఈ కోవకు చెందినవని వేరుగా చెప్పవలసిన పనిలేదు.

యువత ఎదుర్కొంటున్న సమస్యలలో భావ ప్రకటన యొకటి. అత్యధికులకు ప్రసార ప్రక్రియ గురించిన మౌళికమైన అవగాహన ఉండదు. శబ్దములను యధేచ్ఛగా ప్రయోగించుచుందురు. ఈ శబ్ధములలో నిస్సారమైన శబ్ధములే ఎక్కువగా యుండును. పలుకులు జ్యోతిర్లింగములవలె నుండాలని అల్లముడు సూచించాడు. జ్యోతిర్లింగము అనగా! చెప్పవలసిన విషయమును ఎంతో ప్రకాశమానమైన శబ్ధముల ద్వార చెప్పుటయే. భావమును స్పష్టముగా ప్రసరింపజేసే శబ్ధములను

ప్రయోగించాలనేది గ్రహించవలసిన విషయము. అల్పమైన శబ్ధములతో అనంతమైన ప్రభావాన్ని ప్రభవింపచేయాలనేదే గ్రహించవలసిన విషయము. అల్లముడు స్వరము – పరతత్వము వలె నుండవలెనని చెప్పెను. యిచట స్వరమనగా! ప్రసార ప్రక్రియలోని శబ్ధ ప్రసరణ మాటలను పలికే విధి విధానము. సందర్భాను సారంగా మంద స్వరముతోనో మహిమాన్విత ఉచ్ఛస్వరముతోనో మాట్లాడి మాటలయొక్క పరమావధిని తెలియజెప్పుటే. ఈ విషయములో వైఫల్యము జెందే వారి సగటు సంఖ్య గణనీయంగా ఉంటుంది. చివరగా! ప్రసారముల యొక్క అంతిమ లక్ష్యము ఎదుటి వాడిని మన ఆలోచనా సరళికి అనుకూలంగా మలచుకోవటమనేదే గుర్తించవలసిన విషయము. అల్లముడు నిర్ణయీకరణ గురించియు ఒక వచనమును చెప్పెను.

**తెలివి తెలివి అంటున్నారు తెలివి సామాన్యమా?**
**వెనుకటి అడుగు చూచిగాక నిలిచిన అడుగును తెలియలేము**
**ముందటి అడుగు తెలియక ఒక పాదము నెలకొనదు**
**నేలవిడిచి ఆకాశములో నిలుచి**
**మబ్బుల్లో మెరవకుండా తానుకాలేడు**
**గుహేశ్వరుడు అనేది వూరకే వస్తుందా?చెప్పండి!**

చేయవలసిన నిర్ణయాన్ని చేయవలసిన సమయములో జేయవలయుననేదే అల్లముని ఉద్బోధ. నేటి యువకులకు ఈ విషయములో సరియైన అవగాహన లేదనే చెప్పాలి. సమయస్ఫూర్తిని విస్మరించి నిర్ణయాలను చేస్తూ ప్రతికూలమైన ఫలితములను ఎదుర్కొనుచున్నారు. చేతులు గాలిన పిదప ఆకులను పట్టిన విధంగా ప్రవర్తించుచున్నారు. చివరగా చెప్పాలంటే వ్యక్తిత్వ వికాసములో ప్రేరణకు ఎంతో ప్రాముఖ్యత గలదు. బసవేశ్వరునికి అల్లముడే ప్రేరకుడు. అయితే నేటి యువతకు ప్రేరణను అందించువారు తక్కువగా గలరు. అల్లముని వచనములను పఠియించి ప్రేరణను పొందే ప్రయత్నమును చేయుదురుగాక!

యిచట చేయబడిన సూచనలు కేవలం సూచన ప్రాయమైనవే. అల్లముని వచనములన్నింటిని వ్యక్తిత్వ వికాస కోణములో విశ్లేషించవలసిన ఆవశ్యకత ఎంతైనా

గలదు. నేటి మేధావులు యిట్టి ప్రయత్నము చేసిన యెడల విశ్వమానవ కల్యాణము సుగమము కాగలదు.

**అనువాద విధానము**

అల్లముని వచనములను అనువదించిన వారు అనేకులు గలరు. వీరిలో కొందరు కొన్ని వచనములకే పరిమితము కాగా మరికొందరు గరిష్ట స్థాయిలో ప్రయత్నమును సల్పిరి. ఈ ప్రయత్నములలో శూన్య సంపాదనలోని అనువాదము అతి ముఖ్యమైనది. జోళదరాశి దొడ్డన గౌడ అనే లబ్ధ ప్రతిష్ఠుడు చేసిన యనువాదము ముఖ్యమైనది. బసవ సమితివారు ప్రకటించిన 'వచనము' యనబడు గ్రంథములో అల్లముని వచనములకు అనువాదము కలదు. దీనిని శ్రీ గుత్తి చంద్రశేఖరరెడ్డి గారి సంపాదకత్వములో అనువాద మండలి అనువాద ప్రక్రియను చేపట్టినది. మడివాళప్పషెట్కార్ జహిరాబాద్ గారి నేతృత్వములో కొన్ని వచనములు అనువదించబడినవి.

ఈ అనువాదములన్నింటిని పరిశీలించడమైనది. స్వేచ్ఛా అనువాదమే శ్రేయస్కరమని ఎంచబడినది. తదనుగుణముగనే అనువాద సరళి కొనసాగినది. భావ స్పష్టతకే ప్రాధాన్యత నీయబడినది. సామాన్యులకు గూడ సులభముగా అవగతమగు విధముగా తగుచర్యలు చేపట్టనైనది.

**వ్యాఖ్యాన విధానము :**

పైన వివరించిన అనువాదములలో వ్యాఖ్యానములు లేవనే చెప్పాలి. వ్యాఖ్యానము లేకుండా యుంటే వచనముల యొక్క అనువాదము పరిమితమైన ఫలితములు యిస్తుందని భావించనైనది. యౌగిక పరిభాషతో అలంకృతమైన వచనములను తప్పనిసరిగా వివరించి చెప్పవలసిన ఆవశ్యకత గలదని గుర్తించనైనది. షట్థ్సల సిద్ధాన్తము యొక్క నేపథ్యములో వ్యాఖ్యానము చేపట్టనైనది. పారిభాషిక పదముల అవగాహనకై "అల్లమ ప్రభుదేవర వచన సంపుటి" డా॥బి.వి.మల్లాపుర సంపాదకత్వమున రెండవ సమగ్ర వచన సంపుటిని కర్ణాటక ప్రభుత్వముచేత ప్రకటింపబడిన దానిని గ్రహించనైనది. అలాగే "అల్లమ ప్రభుదేవర వచన– నిర్వచన" శ్రీసిద్ధేశ్వర స్వామిగారిచే వ్రాయబడిన గ్రంథము కూడా ఉపకరించినది.

అల్లమప్రభు వచన వైభవము

# భక్తస్థలము

# అల్లమప్రభు వచనవైభవము

విశ్వజ్యోతి-విశ్వమానవుడు- విశ్వైకనుతుడు, ఐన మహాత్మ బసవేశ్వరుని, క్రాంతిలో పాల్గొని, శరణ సంస్కృతికి వన్నె తెచ్చిన మహానీయులు ఎందరోగలరు వీరిలో శ్రీ అల్లమ ప్రభువు అగ్రగణ్యులు. బసవేశ్వరుడు అల్లమప్రభువు చేత ప్రభావితుడై భక్తి ఉద్యమానికి వినూత్నమైన శోభను చేకూర్చగ బసవని భక్తి చేత పరవశుడైన ప్రభువు బసవణ్ణను గురు,లింగ,జంగమ స్థానములో నిల్పి కీర్తించి శరణులకు బసవణ్ణ యొక్క గొప్పతనమును తెలియ చెప్పెను. అనుభవ మంటపములో అగ్రస్థానము నధిరోహించిన వారు అల్లమా ప్రభువు కాగా, నిమ్నస్థానమున కూర్చుండి శరణులను సేవించిన వారు బసవణ్ణ ఈ వినయమే బసవణ్ణను విశ్వపూజ్యునిగా చేసినది ఈ విధంగా బసవణ్ణకే కాక వచన కారులందరికి ప్రేరణను ఇచ్చిన ప్రభుదేవుని వచనములు మానవాళిని సన్మార్గములో పయనింపచేసే మణిదీపికలు.

**వ.సం.1**

**కన్నడమూలము**

**శిలె యొళగణ పావకనంతె**
**ఉదక దొళగణ ప్రతిబింబదంతె**
**బీజదొళగణ వృక్షదంతె**
**శబ్దదొళగణ నిశ్శబ్దదంతె**
**గుహేశ్వరా! నిమ్మ శరణ సంబంధ!**

**తెలుగు రూపము**

శిలలోగల పావకుని వలె
ఉదకములోగల ప్రతిబింబము వలె
బీజములోగల వృక్షము వలె
శబ్దములో గల నిశ్శబ్దము వలె
గుహేశ్వరా! మీ శరణుని సంబంధము!

**వ్యాఖ్య:-**

పిండ స్థలములో నుండెడి శివశరణునిలో నంతర్గతముగా నుండెడి శివభక్తి యొక్క అస్తిత్వమును గురించి యీ వచనము తెలుపుచున్నది. భవబంధముచేత బద్ధుడై సంసార లంపటత్వమే నిజమైన సుఖమనే భ్రాంతితో జీవించే జీవిని శాస్త్రము భవిగా గుర్తించినది,పాపాధిక్యత యిట్టి వ్యక్తికి ప్రాథమిక లక్షణమై యుండును,ఐహికసౌఖ్యమేపరమలక్ష్యమగును లక్ష్యసిద్ధికి పుణ్య-పాపముల చింతన వీడి సంచరిస్తూ చరిత్ర హీనుడగును.భవిదుఃఖితుడైన స్థితిలో పొందెడి మానసిక క్షోభ, నైతిక క్షుద్రత్వము గలవాడి నిస్సంగత్వము,సజ్జన సాంగత్యము, సానుకూల స్థితిగతులు, శివ శరణుల గాథలు మొదలగు నవి మానసిక పరివర్తనను తెచ్చే కారణములగును, పూర్వజన్మసుకృతములు గలవారికే యిట్టి స్థితి లభించునని కర్మవాదము చెప్పుచున్నది."మానసిక పరివర్తనే న పాపీ పుణ్యవాన్ భవిష్యతి" అనేది అనుభవోక్తి. భక్తకన్నప్ప చరిత్ర. దృష్టాంతముగా నిలుచుచున్నది. పుణ్యాధిక్యతను సంపాదించిన దశలో భవి భక్తుడగుటకు సంసిద్ధుడగును. భక్తుడనే శబ్దము సాంకేతికపరమైనది. శైవశాస్త్రము ప్రకారముగా సంస్కారము బొందినవాడు. గురూపదిష్టమార్గము నందు చరించేవాడు. లింగాంగ సామరస్యసిద్ధికై యత్నించేవాడు. "బహుజన్మ కృతైఃపుణ్యైః ప్రక్షీణే పాపపంజరే జీవో భక్తోభవిష్యతి" అనేది గురూక్తి. పుణ్యాత్ము లకు మాత్రమే లభించే యిట్టి మానసిక స్థితిలో శివభక్తి అవ్యక్తముగా నుండును.శిలలోనిచిచ్చు, జలములోని ప్రతిబింబము, గింజలోని చెట్టు, శబ్దములోని నిశ్శబ్దము యే విధముగా దాగియుండునో అదే విధముగా శివభక్తి అవ్యక్త స్థితిలో నుండును. ఈ వచనములో "శరణ సంబంధ" మనే వాక్యము అత్యంత ముఖ్యమైనది. దీనిని విస్మరించినచో విభిన్నమైన భావములు స్ఫురించును. అవగాహన జటిలమైనదగును. ఇందులోని శరణ శబ్దమును సాంకేతికముగా స్వీకరించుటకు వీలులేదు. దీనిని భక్త పదమునకు పర్యాయపదముగా స్వీకరించవలెను.ఈ వచనమును పోలిన వచనమొకటి బసవేశ్వరులవారు విరచించిరి.

**వ॥ ఉదకములో నొదిగిన నీర్చిచ్చట్లున్నది**
**సస్యములోని రసరుచియట్లున్నది**

ననములోని పరిమళమట్లున్నది(మొగ్గలోని)
కూడల సంగమదేవుని నెలవు
కన్నియ స్నేహమట్లున్నది.

(బసవేశ్వర గీతామృతము వచనము-1 పేజీ 53) వివరములకై బసవేశ్వర గీతామృతమును చూడండి

**వచనము సం.2**
**కన్నడ మూలము**

**కల్లొళగణ కిచ్చు ఉరియ బల్లుదె?**
**బీజదొళగణ వృక్ష ఉలియ బల్లుదె?**
***తొరలిల్లాగి బీరలిల్లారిగెయు!***
**గుహేశ్వర నిందనిలవ అనుభావసుఖ బల్ల**

**తెలుగు రూపము**

రాయిలోని చిచ్చు రగిలి మండగలదా?
విత్తులోని చెట్టు సవ్వడి చేయగలదా?
ఎవ్వరికీ కనిపించవు,
వేరు పడి వీడి పడవు
గుహేశ్వరుడు నిలిచిన నెలవు
అనుభవ సుఖమెరుగును

**వ్యాఖ్య:-**

శివభక్తి తనకు తానుగా బహిర్గతము కాజాలదని అల్లమ ప్రభువు తెలుపు చున్నాడు.రాయిని రాపిడికి గురిచేస్తేనిప్పుపుట్టును. దానికి యింధనము జోడించిన మరుక్షణమే భగభగమనే మంటలు విస్తరించును. విత్తును నేలలో నాటి, యెరువు వేసి నీళ్ళుపోసి పోషించినచో వృక్షము పెరిగి పెద్దదై లోకోపకారి కాగలదు. ప్రయత్నమే యీ ఘటనల వెనుక గల రహస్యము. పుణ్యము సంపాదించియూ భక్తులగుటకు యత్నించక చెడిపోయిన వారెందరో గలరు. అశ్వమేథ యాగము సలిపిన దక్షుడు,

శతమఖముల జేసిన త్రిశంకువు, దానశీలియై వెలిగిన కర్ణుడు మొదలగు వారుయీ కోవకు చెందిన వారు. వీరెల్లరూ అంతరంగ శుద్ధి లేనివారే. ఇదియే వీరి ప్రయత్న శీలతకు అవరోధముగా నిలిచినది. "శుద్ధాన్తఃకరణో జీవీపిండో భవతి" అనేది శాస్త్రోక్తి. మనోబుద్ధ్యహంకారచిత్తములు అంతఃకరణలనబడుచున్నవి. వీటిని నిర్మలముగా పెట్టికొనవలసిన అవశ్యకవత కలదు. లేనిచో వ్యక్తి అరిషడ్వర్గముల చేత పీడితుడై పతితుడగును. అసత్యము పలుకుట, దొంగిలించుట, దొరతనము చూపుట, చంపుట, చపలచిత్తుడగుట, ఆత్మస్తుతికి, పరనిందకు ప్రాముఖ్యతనిచ్చుట, యితరులను అసహ్యించికొనుట, కామియగుట, కాంతాదాసుడగుట మొదలగు దుర్గుణములబ్బును. అంతరంగ శుద్ధిని పొందుటకై యత్నించి సఫలీకృతుడైనవాడే పిండస్థలమున సాఫల్యతను సాధించగలడు. ఇట్టి దాని సిద్ధికై భగవత్ ప్రేరణ కావలెనని భావింపబడుచున్నది. భక్తుని ఉద్ధరించుటకై భగవంతుడు ప్రేరక పాత్రను పోషించునని తెలియుచున్నది. పరతత్త్వము అవిభాజ్యమైన దైననూ స్వసంకల్పాను సారముగా భోక్తృవు, భోజ్యము, ప్రేరక రూపముల దాల్చునని శైవశాస్త్రము చెప్పుచున్నది. భోక్తృవు జీవుడు. భోజ్యము ప్రకృతి. ప్రేరకుని ప్రేరణ వలన భవి భక్తుడై భక్తిమార్గమున చరించి ధన్యుడగుచున్నాడు. అలక్ష్యము చేసినవాడు జననమరణ చక్రబంధములో చిక్కి దుఃఖితుడగునని తెలియుచున్నది.

**వచనము సంఖ్య-3**

**కన్నడ మూలము**

**జలదొళగిర్ద కిచ్చు జలవసుడదె**
**జలవుతానాగిర్దిత్తు నోడా!**
**నెలెయనఱిదు నోడిహ వెందడె**
**అదు జలవు తానల్ల!**
**కుల దొళగిద్దు కులవ బెరసదె**
**నెలెగెట్టు నిందుదనారు బల్లరో?**
**హొఱగొళగె తానాగిర్దు మత్తె తలెదోరదిప్పదు**
**గుహేశ్వరా నిమ్మ నిలవు నోడా!**

**తెలుగు రూపము:**

జలములోనున్న చిచ్చు జలమును కాల్చక
జలము తానై యున్నది, చూడుమా!
నిలుకడగా చూసినచో
అది జలము తాను కాజాలదు
కులములో నుండియూ కులములో కలియక
గట్టు మీద నిలిచిన వాని నెవ్వరెరుగుదురు
వెలుపలలోపల తానేయై యుండి
మరేదియూ తలపించకుండేది
గుహేశ్వరామీ నెలవు చూడుమా!

**వ్యాఖ్య:-**

పరశివుడు ప్రేరకుడై ప్రేరణనిచ్చేదెవ్వరికి? ఈ ప్రశ్నకు సమాధానముగా యీ వచనము నిలుచుచున్నది. జలములోని నిప్పు జల పరిధిని దాటి గట్టు మీదికి వచ్చినచో జలముగా దాని అస్తిత్వము మృగ్యమైన దగుచున్నది. ఆవుల మందలోని యొకానొక ఆవు మందనుండి వెలుపలికి వచ్చి మందకు దూరముగా చరించినచో మందలోని ఆవులు దానిని విస్మరించే స్థితికి చేరును. ఈ రెండు ఉదంతాలలోనూ ద్వంద్వత్వము గాంచగలము. అంతరంగ బహిరంగములలో గల భిన్నత్వము కలదు. అంతరంగ బహిరంగములలోనేకత్వము లేని వారి నెందరినోగాంచ గలము. పయోముఖ విషకుంభముల చేత పీడితులైనవారు కోకొల్లలు. గోముఖ వ్యాఘ్రముల చేత వంచింపబడిన వారనేకులు గలరు. పిండ స్థలములోని భక్తునికి త్రికరణశుద్ధి గల్గి యుండాలని తెలియుచున్నది. మనస్సులో నుండేదే నాలుక మీదికి రావలె ననేది మొదటి సూత్రము. కపటత్వమునకు ఆస్కారము వుండవలదు. చెప్పేదే చేయాలి. మోసపుచ్చుట చేత పాపాధిక్యత పెరుగును. అంతరంగ బహిరంగములలో నేకత్వము గలది భగవత్తత్త్వము. భగవదనుగ్రహము వాంఛించే వారెవ్వరైననూ అంతరంగ బహిరంగములలో నేకత్వమును ప్రదర్శించవలెననేది గ్రాహ్యము.

## వచనము సంఖ్య-4
### కన్నడ మూలము

**నెలెయ మఱెయలడగిద నిధానదంతె**
**ముగిల మఱెయలడగిద మించినంతె**
**బయల మఱెయలడగిద మరీచియంతె**
**కంగళ మఱెయలడగిద బెళగినంతె**
**గుహేశ్వరా! నిమ్మ నిలవు.**

### తెలుగు రూపము

నేల మరుగున నణగిన నిధానము వలె
మొగులు మరుగున నణగిన మెరుపు వలె
బయులు మఱుగున నణగిన మరీచి వలె
కళ్ల మరుగున నణగిన వెలుగు వలె
గుహేశ్వరా! మీ నెలవు.

**వ్యాఖ్య:-**

మొదటి వచనములోని భావమే విస్తరింపబడినది. పిండస్థలము నందలి భక్తునిలోగల భక్తి గోప్యముగా నుండుననేదే గ్రహించవలసిన యంశము.

# పిండజ్ఞాన స్థలము

**వచనము సంఖ్య-5**

**కన్నడమూలము**

**ఆది ఆధార విల్లదందు**
**హమ్ము బిమ్ముగళిల్ల దందు**
**సురాళ నిరాళ విల్లదందు**
**శూన్యని శ్శూన్యవిల్లదందు**
**సచరా చరవెల్లా రచనెగె బారదందు**
**గుహేశ్వరా! నిమ్మ శరణను దయిసిదందు**

**తెలుగు రూపము:**

ఆది ఆధారము లేని యపుడు
అహంబిహంలు లేని యపుడు
సురాళ నిరాళము లేని యపుడు
శూన్యనిశ్శూన్యములు లేని యపుడు
సచరా చరము లెల్లా రచనకు రాని యపుడు
గుహేశ్వరా మీ శరణుడు
ఉదయించిన దపుడు

**వ్యాఖ్య:**

శివ-శరణుల సంబంధమెప్పటి నుండి కొనసాగుచున్నదో అనేది తెలిపే యత్నమును యీ వచనమునందు చూడగలము. శరణోదయ సమయమును సూచించుటకై కొన్ని ఘటనలు సూచితమైనవి. మొదటిది ఆది. పరమశివుడు ఆది లేని వాడు. ఇచట ఆది యనగా జగత్ సృష్టికంటె ముందున నుండే స్థితి. జగత్తు పుట్టిన ముందే శరణుడు శివసన్నిధిలో గలడని చెప్పబడినది. జగదాధారమనగా ముప్పదియారు తత్త్వములు, పృథివ్యాది శివపర్యంతము గలవి యివి. వీటిలో శక్తి

కూడ గలదు. శరణుడు శక్తి కంటెను పూర్వుడనేది గ్రాహ్యాము. అహం బిహంలు నిరాకార నిరంజన శివపరతత్త్వములో గల్గిన భావాలు. "అహం అస్మి" 'అహం సర్వకరా' అనేవి యీ భావాలు. పరశివునిలో యీ భావ పరంపర పుట్టకమునుపే శరణోదయము సంభవించినది. సురాళ నిరాళములు సగుణ నిర్గుణాకారములను సూచించును. శివుడు యీ రెంటిని దాల్చని కాలములో శరణుడు శివ సన్నిధిలో గలడని చెప్పబడినది. శూన్య-నిశ్శూన్య స్థితులు సంసార-సామరస్యములకు సంకేతములు. భవి సంసారమును భక్తుడు శూన్యమును సంపాదించును. చివరగా చరాచరజగత్తు పరిణామ క్రమములోన యేర్పడినది. పిండస్థలములోని భక్తుడు పై యంశముల నెరిగినవాడై సాధనాక్రమములో పయనించుననేది తెలిసికొనవలెను. మరొక మాటలో చెప్పాలనిన శివజీవ భేదము సాదృశ్యమైనదేకాని సంపూర్ణమైనది కాదని యెరుగవలెను. బహుశః ఈ కారణము వలననే కాబోలు శృతి "నారుద్రో రుద్రమర్చయేత్" అని చెప్పుచున్నది. దీని భావమేమనగా రుద్రాభిషేకము చేయు సమయములో భక్తుడు తాను రుద్రుడనై రుద్రుని అర్చించుచున్నాను అనే భావమును పొందవలెనని చెప్పబడినది. ఇదే విధముగా పిండజ్ఞాని తనకు శివునకు గల భేదము సాంకేతిక మైనదే కాని సమగ్రమైనది కాదని గుర్తించి చరించవలెను.

**వచనము సంఖ్య-6**

**కన్నడ మూలము:**

**నాదబిందు గళిల్ల దందు**
**నిర్భయ నెంబి గణేశ్వరను**
**ఉత్పత్తి స్థితిలయ గళిల్ల దందు**
**అక్షయనెంబ గణేశ్వరను**
**ఓదు వేదగళిల్ల దందు**
**ఓంకారనెంబ గణేశ్యరను**

**యుగజుగం గళిల్ల దందు**
**ఊర్ధ్వము ఖనెంబ గణేశ్వరను**
**గుహేశ్వర లింగ విల్లదందు**
**నిర్మాయానెంబ గణేశ్వరను**

**తెలుగు రూపము:**

నాదబిందువులు లేని యపుడు
నిర్భయుడనే గణేశ్వరుడు
ఉత్పత్తి స్థితిలయలు లేని యపుడు
అక్షయుడనే గణేశ్వరుడు
చదువు వేదములు లేని యపుడు
ఓంకారుడనే గణేశ్వరుడు

యుగ యుగంబులు లేని యప్పుడు
ఊర్ధ్వముఖుడనే గణేశ్వరుడు
గుహేశ్వర లింగము లేని యప్పుడు
నిర్మాయుడనే గణేశ్వరుడు

**వ్యాఖ్య:-**

శరణు డెప్పటి వాడో అనేది తెలిపే మరికొన్ని అంశములను చూపే యత్నము నిచ్చట గాంచగలము. నాద-బిందువులు జగన్నిర్మాణముతో ముడిపడి యున్న అంశములని చెప్పబడు చున్నది. మొదట. నాదము పుట్టినదనియూ ఆ పిదప ప్రపంచము బిందురూపమును దాల్చినదనియూ, యీ బిందువు సకళ స్వరూపము పొంది జగత్తు యేర్పడినదని అందురు. అయితే పరతత్త్వమైన శివుడు నాదబిందు కళాతీతుడని శైవశాస్త్రము చెప్పుచున్నది. శివశరణుడట్టివాడే యని యీ వచనము చెప్పుచున్నది. అప్పుడతడు నిర్భయుడుగా పిలువబడును. ఉత్పత్తి స్థితి లయలు భగవంతుని కృత్యములు. పుట్టిన వాడెంతటి వాడైననూ గిట్టక తప్పదు. ఇది సామాన్య సూత్రము. అయితే శరణుడు దీనికి కట్టుబడి యుండడు. అతడు అక్షయుడు. చదువులు, వేదములు జ్ఞానమునకు చిహ్నాలు. జీవుడు జ్ఞానము బొంది తరించవలెనని చెప్పేవారు గలరు. శివుడు వేదాతీతుడని శైవశాస్త్రము చెప్పుచున్నది. ఓంకారుడనే శరణుడట్టివాడే. యుగము కాలమునకు సంకేతము. శివుడేవిధముగా కాలాతీతుడో అదే విధముగా శరణుడు కాలమానమునకందని వాడు. ఈ స్థితిలో నతడు ఊర్ధ్వముఖగణేశ్వరుడనబడును. శివుడు కైవల్యావస్థలో నున్నపుడు అతడు

యేకాకి. శక్తి సాంగత్యము వుండదు. ఈ స్థితిలోనూ శరణ సంబంధము నిలిచి యుండును. చివరగా, మాయా ప్రభావానికిలోనైన శివుడు పురుషుడుగా పరిణమించిన స్థితిలోనూ శరణుడు శివసన్నిధిలో నున్నాడని అల్లముడు చెప్పుచున్నాడు. శివుడు లింగరూపము దాల్చుటయనేది పరిణామక్రమములో నొక భాగము. శరణుడు మాయకు లోబడేవాడు కాడని తెలుపుటకే అతనికి నిర్మాయుడనే పేరిడబడినదని గ్రహించ వలెను.

**వచనము సంఖ్య:-7**

**కన్నడ మూలము**

**అయ్యా! జలకూర్మగజ ఫణెయ మేలె**
**ధర విస్తరిసినిల్ల దండు.**
**గగన విల్లదందు, పవనన సుళిహదందు**
**అగ్నిగె కళెదొరదందు**

**తరుగిరి తృణకాష్ఠాది గళిల్ల దందు**
**యుగజుగ మిగిలెనిసిద హదినాల్కు భువన**
**నెలెగొళదందు**
**నిజవనతిదెహెనెంబ**
**త్రిజగా ధిపతిగళిల్లదందు**

**తోఱువబీఱువ భావదపరి!**
**ఆ భావదల్లి భరిత అగమ్య**
**గుహేశ్వరన నిరాళవు**

**తెలుగు రూపము:-**

అయ్యా! జలకూర్మగజ ఫణి
మీద విస్తరించిన ధరలేని యపుడు
గగనము లేదపుడు
పవనుని ప్రసారము లేదు అపుడు

అగ్నికి కాంతి లేదు అపుడు

తరుగిరితృణ కాష్ఠాదులు లేవు అప్పడు
యుగ యుగాలుగా మిగుల పరిగణింపబడిన
పదునాల్గు లోకములు నెలకొనలే దపుడు
నిజము నెరిగితిమని భావించెడి
త్రిజగాధి పతులు లేరు అపుడు
తోచే వెలువడేభావపు విధి!
ఆ భావము నందు నిండియున్న
అగమ్యుడు గుహేశ్వర నిష్కళుడు.

**వ్యాఖ్య:-**

పంచభూతములు, పంచభూతాత్మకమైన ప్రపంచము త్రిమూర్తులు లేని యపుడు శరణుడు గలడనేది తెలుపబడినది. జలములో భూమి గలదని, విష్ణువు కూర్మమై భూభారమును మోయుచున్నాడనే పౌరాణిక గాథలు గలవు. అష్టదిగ్గజములు భూమిని మోయుననే కథలు కలవు. అదే విధముగా ఆదిశేషుడు భూమిని మోయునని అందురు. ఇవన్నియూ లేని యప్పుడు శివసన్నిధిన శరణుడు ఉన్నాడు. అగ్ని వెలుగు, వాయువు వీచుట త్రిమూర్తుల పాలన, ఆకాశము ఇవన్నియూ అర్వాచీనములే. శరణుడు ప్రాచీనుడు. శివుడు నిరాకారుడు భావగమ్యుడు శరణుని నెలవు భావమునకు గోచరించేదే.

**వచనము సంఖ్య:-8**
**కన్నడ మూలము**

**అయ్యా! నీను నిరాళ నిర్మాయానాగి**
**ఇప్పయాగి ఆకాశ ప్రకాశవిల్లదందు**
**సాక్షిస భేగళిల్లదందు**
**సచరాచర వెల్లా రచనెగె బారదందు.**

ఆధారదొళగణ విభూతియం తెగెదు
భూమియ నెలగొళిసి
పంచాశత్కోటి విస్తీర్ణద భూమండలక్కె
సుత్తి హరిదవు సప్తసాగరగళు
ఎంబత్తాఱు కోటియుం
తొంబతేళు లక్షకాల

భువన మండలక్కె ఉదయబ్రహ్మాండ
అఱువత్తాఱు కోటి తారామండల వెందడి
బెళగితోఱిద హన్నెరడు జ్యోతియ,
నిలిసి తోఱిద హదినాల్కు భువనవ

ఈ జగదజంగుళియ కావ గోవళతనాగి
చౌరాసి లక్షజీవరాశి గళిగె రాశివాళ తానాగి
సకలద అళివిన ఉళివిన నింద
నిజద నిలవ నోడి కండెను.
గుహేశ్వరా! నిమ్మశ్రీపాదక్కె
నమోనమో ఎనుతిద్దెను.

తెలుగు రూపము

అయ్యా! నీవు నిష్కల నిర్మాయా వంతు
డోలై యుండుట చేత
ఆకాశ ప్రకాశములు లేవు అపుడు
సాక్షి-సభలు లేవు అపుడు

సచరాచరము లెల్లా రచనకు రాని యపుడు
ఆధారములోగల విభూతిని తీసి
భూమిని నెలగొలిపి

పంచాశత్కోటి విస్తీర్ణము గల భూ మండలముకు
చుట్టూ విస్తరించినవి సప్త సాగరములు
ఎనభైయారు కోట్ల తొంభై
యేడులక్షల కాలము
భువనమండలమునకు ఉదయ బ్రహ్మాండము
అఱువైయాఱు కోట్ల తారామండలమైనచో
వెలిగి కనిపించిన పన్నెండు జ్యోతులు
నిలిపి చూపిన పధ్నాల్గు భువనములు

ఈ జగములోని సమూహముల యేలికతానై
యెనభైనాల్గు లక్షల జీవరాశులకు
రాశిరక్షకుడు తానై
సకలము యొక్క పరిధినందు
ఉనికి యందు నిలచిన నిజమైన నెలవు
చూసి కనుగొంటిని
గుహేశ్వరా! మీ శ్రీచరణములకు
నమో నమో యనుచు నిలిచితిని

**వ్యాఖ్య:-**

అల్లమ ప్రభువు, పిండజ్ఞానిగా నున్న స్థితిలో, తనలో గల్గిన భావములను వివరించిరి. శివుని కైవల్య స్థితిలో శివసాంగత్యమున నుండిన అల్లమ ప్రభువు సచరాచర సృష్టి ప్రక్రియను గాంచినట్లుగా దోచుచున్నది. శివుడు కైవల్య స్థితిలో ప్రశాంత మూర్తి. ఆకాశము కాని, ప్రకాశము నిచ్చే సూర్యచంద్ర తారామండలములు లేని స్థితి. దేవఋషి సంకులమై యుండే కైలాస సభయూ లేదు. శివమూర్తి ఉనికిని చూసిన వారు లేనే లేరు. ఈ స్థితిలో శివునిలో కదలిక గలిగెను. సృష్టించాలనే సంకల్పము కలిగెను. అతనిలోని శక్తి బహిర్గతమై జగత్ సృష్టి ప్రారంభింపబడెను. భూమ్యాకాశములు, గ్రహనక్షత్ర మండలాలు, చతుర్దశ భువనాలు, యెనభై నాల్గు లక్షల యోనులలో జన్మించే వివిధ జీవులు సృష్టింపబడెను. ఐతరేయోపనిషత్తులోన చెప్పబడిన జగత్ సృష్టిక్రమము అల్లమప్రభువు వివరించిన క్రమమును పోలియున్నది.

ఇది గమనార్హమైన విషయము. స్థితి ప్రక్రియలోన నంతర్భాగముగా పాలన, పోషణలు కలవు. శివుడే వీటిని నిర్వహించునని తెలియుచున్నది. శివుని విభూతి గురించిన ప్రస్తావన కలదు. ప్రలయానలములో బడి భస్మమైన చరాచర జగత్తుకు సంబంధించినదే యీ విభూతియనే భావము స్ఫురించే యవకాశము కలదు. కొన్ని పౌరాణిక గాథలు యీ భావమును సమర్థించుచున్నవి. తాత్త్వికముగా పరికించినచో విభూతియనే శబ్దము శివుని శక్తియని తెలియుచున్నది. శివశక్తుల సంయోగము చేత జగత్తు పుట్టునని శైవశాస్త్రము  చెప్పుచున్నది.

**వచనము సంఖ్య:-9**

**కన్నడ మూలము**

**తలెయిల్లద తలెయాతంగె కరుళిల్లదఒడలు**
**ఆ నల్లంగె అంగవిల్లద అంగనె సతియాగిప్పకు**
**ఇవరిబ్బర బసురల్లి హుటిదళెమ్మతాయి**
**నా హుట్టి తాయ కైవిడిదు**
**సంగవ మాడి నిర్ద్రోషియాదెను**
**నోడా! గుహేశ్వరా!**

**తెలుగు రూపము**

తలలేని తలగల వానికి ఒడలులేని ఒడలు
ఆ అందగానికి అంగములేని అంగన సతిగా నున్నది.

వీరిరువురి కడుపులో పుట్టినది మన తల్లి
నేను పుట్టి తల్లిని చేపట్టి
సంగము జేసి నిర్ద్రోషినైతిని
చూడుమా! గుహేశ్వరా!

**వ్యాఖ్య:-**

సామాన్యముగా చూస్తే యీ వచనము అవగతము కాదు. మర్మగర్భితమైనది. క్రీడావస్థలోని మొదటి దశలో శివశక్తులు నిష్కళా మూర్తులే! "శివస్యపరమా శక్తిః

శివ స్వరూపాను సారిణీ" అనేది పండితోక్తి. ఈ యంశము చక్కగా వివరింప బడినది. శివ-శక్తుల బిడ్డ శివభక్తి. భక్తి భక్తులెల్లరకూ తల్లి వంటిదే. శివభక్తిలో మునిగి తేలుటే సంగమించుట. ఈ సంగమము వలన త్రిమలములు దూరమై భక్తుడు నిర్మలుడగును. కార్మికమలము పోవుట చేత జన్మజన్మాంతర దుష్కృత దోషములు తొలగును. మాయామలము పోవుటచే మిశ్రతత్త్వముల వల్ల సంక్రమించిన దోషాలు వైదొలగును. ఆణవమల నిర్మూలన చేత శుద్ధ మాయా సంగత దోషములు పోవును. ఈ పరిణామముల వలన పిండజ్ఞాని భక్తుడగుటకు సంసిద్ధుడగును. భక్త స్థలమున ప్రవేశించే అర్హత పొందును.

**వచనము సంఖ్య-10**

**కన్నడ మూలము**

**ఎన్ననా నరియ దందు మున్న నీనే నాగిర్దె హేళా!**
**మున్న బాయముచ్చి కొండిర్దె ఎంబుద**

**నా నిన్న కణ్ణింద కండెను**
**ఎన్న నానరిసిద బళిక ఇన్నునీ బాయ**
**తెరెదు మాతనాడిదడె**
**అదనన్న కణ్ణింద కండు నాచిదే నోడా!**

**ఎన్న కాబనినగె, నిన్న కాబ ఎనగె**
**సంబంధ ఒందే నోడా!**
**గుహేశ్వరా! నిన్న బెడగిన బిన్నాణవ**
**నానరిదె నోడా!**

**తెలుగు రూపము**

నన్ను నేనెరుగనపుడు మున్నున నీవేమైయుంటివి చెపుమా
మున్నున నోరు మూసికొని యుంటి వనేదానిని

నేను నా కళ్ళతో చూసితి
నన్ను నేనెరిగిన పిదప ఇంకనూ నీవు

నీవు నోరుతెరిచి మాట్లాడినచో
దానిని నేను నా కళ్ళతో చూసి సిగ్గుపడితి

నేను నిన్ను గనినా
నీవు నన్ను గనినా నాకు నొకటే చూడుమా
గుహేశ్వరా! నీ మార్మిక విజ్ఞానము
నే నెరిగితిని చూడుమా

**వ్యాఖ్య:-**

తనను తానెర్గుట యనే దాని ప్రాముఖ్యత వివరింప బడినది. తనను తాను గుర్తించుట సులభ సాధ్యమైన విషయము కాదు శరీరమే తానని భావించే వారు కలరని తెలియుచున్నది. వీరు చార్వాకవాదులననుసరింతురు. శారీరక సుఖ సంతోషములే వీరికి పరమావధిగా నుండును. తన్నిమిత్తమై ధనము నార్జింతురు. మరణము పర్యంతము భోగభాగ్యములలో తులతూగుటకు యత్నింతురు. భగవంతుని వీరు భోగభాగ్య ప్రదాతగాను, కష్టనష్ట నివారకునిగాను పరిగణింతురు. అర్చనాదులు సాధనములని తలతురు. దేవాలయ వ్యవస్థ మఱ్ఱి చెట్టు వలె పెరిగి పెద్దదగుట యనేది వీరి వలన సంభవించినదే. తన బుద్ధియే తాననే వారు ఇంకా కొందరు గలరు. వీరు భౌద్ధతత్త్వము ననుసరింతురు. తన ఆత్మనే తాననే వారు మరికొందరు. వీరు ఉపనిషద్యాదుల ననుసరింతురు. దశోపనిషత్తులు, బ్రహ్మసూత్రములు, భగవద్గీతలు వీరికి ప్రధానమైన ఆధారములు. పరతత్త్వమే తానని యెరిగిన వారు చాలా తక్కువ సంఖ్యలో నుందురు. అల్లమప్రభువు యీ కోవకు చెందినవాడని యీ వచనము తెలుపుచున్నది. తనను తానెరుగని దశలో జీవుడు జ్ఞాన శూన్యుడై యుండును. జీవుని జ్ఞానమయునిగా చేసే బాధ్యత శివునిదే. అల్లమ ప్రభువు అభ్యర్థన దీనిని సూచించుచున్నది. శివతత్త్వ వివేచన యనేది యెంతో గోప్యమైన యంశమనేది తెలియుచున్నది. ఈ విషయ మిచ్చుట ధృవీకరింపబడినది. ఇది వేదాన్త జన్యమని కొందరంటే సిద్ధాంతజన్యమని మరి కొందరి యభిమతము. గురూపదిష్టమని కొందరంటే అనుభవైకవేద్యమని కొందరందురు. సాధకుడు సదసద్వివేక సంపన్నుడై నిత్యానిత్య వివేచన సహాయము చేత యెరుగదగినది శివతత్త్వము. పిండజ్ఞాని వీటినెరిగిన వాడై విరాజిల్లు ననేది గ్రాహ్యము.

## వచనముసంఖ్య-11

### కన్నడ మూలము

మాయద బలెయల్లి సిబకిద మరుళ
నా నెందరిద పరియ నోడా!

లింగవెందరిద పరియ నోడా!
తన్న వినోదక్కెబందు నిశ్చింత నిరాళ
గుహేశ్వర నెందరిద పరియనోడా!

### తెలుగు రూపము

మాయ యొక్క వలయందు చిక్కిన
పిచ్చివానిని నేనని యెరిగిన విధము చూడుమా
లింగమని యెరిగిన విధము చూడుమా!

తన యొక్క వినోదముకై వచ్చిన
నిశ్చింత నిష్కళ గుహేశ్వరుడని
యెరిగిన విధము చూడుమా!

**వ్యాఖ్య:-**

పిండజ్ఞానిగా అల్లమ ప్రభువు మాయా స్వభావమును, లింగతత్త్వమును, భగవల్లీలా విలాసమును యెరిగి తన సాధన కొనసాగించెనని యీ వచనము వలన తెలియుచున్నది. కైవల్యావస్థయందున శివుడు నిరంజనమూర్తియై నిరాకారుడై యుండునని తెలియుచున్నది. తానున్న స్థితిని తానెరుగని స్థితిలో నుండెను. అతనిలో "అహా మస్మి" అనే చింతన గల్గెను. నేను ఉన్నాను అనేది దీని యర్థము. ఆ పిదప అతనిలో క్రీడాసక్తి పెల్లుబికెను. అతనిలో కదలిక సంభవించెను. తత్ఫలితముగా శక్తి బహిర్గతమయ్యెను. శివశక్తుల సంగమమే క్రీడావస్థ యొక్క ప్రారంభదశ. పరతత్త్వము లింగ-అంగములుగా రూపొందెను. శక్తి కళయై లింగ సాంగత్యమును పొందెనని శివానుభవ సంపన్నులు తెలుపుచున్నారు. శక్తి మాయగా మారి అంగసాంగత్యమును పొందును. మాయా ప్రభావానికి లోనై స్వాతంత్ర్యము కోల్పోయి

బంధితుడగును. విల విలలాడును లింగమునకు దూరమై విలపించును వేటగాని వలలో చిక్కిన మృగము వలెను, బెస్తవాని వలకు చిక్కిన చేప వలె బాధితుడగును. ఈ అనుభవ మిచ్చుట నివేదితమైనది. జీవుడు పిండస్థలమున నున్నపుడు మాయ యొక్క అస్తిత్వము గురించి యెరుగడు. లింగ విజ్ఞాన సముపార్జన మృగ్యమైన దశలో జీవుడు మాయ గురించి యెరుగ జాలడనేది గ్రాహ్యము. పౌరణిక గాథలలో గోచరించే లింగము గురించిన యవగాహన బహుళ వ్యాప్తియందు గలదు. ఇట్టి యనగాహన కంటెను భిన్నమైనది అంగ-లింగ విజ్ఞానము. ఈ రెంటిని కలిపినచో కలిగేది దురవగాహన మాత్రమే. గుహేశ్వర లింగమనగా పరతత్త్వమునకు చెందిన లింగమని గ్రహించవలెను. అల్లమ ప్రభువెరిగినది దీని గురించియే యని తెలిసికొనగలరు. పరతత్త్వమునకు చెందిన లింగమనగా ఏ తత్త్వము నుండి ముప్పదియారు తత్త్వములతో కూడిన జగత్తు వెలువడెనో ఆ తత్త్వము - ప్రళయా నంతరము చరాచర జగత్తు ఏ తత్త్వములో లీనమగునో ఆ తత్త్వము. మరొక మాటలో చెప్పవలెననిన చతుర్దశ భువనములు, వీటికి అధినేతలైన త్రిమూర్తులు, వీరి పాలనలో తిరుగాడే దేవతిర్యఙ్మనుష్యాదులు, ప్రకృతి మొదలైన వన్నియును లింగతత్త్వములో యిమిడి వుండె అంశములే. లింగమును మించిన వారెవ్వరూ లేరు.

# మాయావిలాస విడంబన స్థలము

**వచనము సంఖ్య-12**

**కన్నడ మూలము**

**కాయద మొదలిగె బీజవావు దెందరియదీలోక!**
**ఇంద్రియగళు బీజవల్ల**
**ఆ కళా బేదవల్ల**
**స్వప్న బందెరిగిత్తల్లా!**

**ఇదావంగూ శుద్ధసయిదాన వల్ల!**
**కాణా! గుహేశ్వరా!**

**తెలుగు రూపము**

కాయమున మొదలుకు
బీజమేమి టనేదెరుగదీలోకము
ఇంద్రియములు బీజము కాదు
ఆ కళాభేదము కాదు

స్వప్నము వచ్చి యెరిగినట్లు కాదా!
ఇదెవ్వరికినీ శుద్ధసామగ్రి కాదు
కనుమా గుహేశ్వరా!

**వ్యాఖ్య:-**

ఈ వచనము కాయమెట్టిదో అనే దానిని తెలుపుచున్నది పంచేంద్రియ సంచయమే కాయమున కాధారభూతమైన యంశమనే వాదన కలదు. స్త్రీలో ప్రభవించే ప్రణయకళా భేదములే దేహమునకు మూలమనే వారు కలరు. అల్లమ ప్రభువు యీ వాదములను తిరస్కరించిరి. దేహము అనిత్యమైనదయూ, మాలిన్య భరితమైనదని యీ వచనము తెలుపుచున్నది. నిత్యానిత్య వివేచనలోని అంశములు తెలిపే దానిగా యీ వచనమును స్వీకరించుట యుక్తమని యెరుగ వలెను. కాయము

అనిత్యమైనదని యెరిగియూ అశుద్ధమని తెలిసి కొనియూ దాని పాలన పోషణలకై ఆరాటపడే వారెందరో గలరు. భోగలాలసత్వము గలవారికి యిది యుక్తమని దోచ వచ్చును. యోగులకిది తుచ్ఛమైన చర్యయగును. శివ యోగము ద్వారా లింగాంగ సామరస్యసిద్ధి నభిలషించే వారు దేహమునకు ప్రాముఖ్యత నివ్వరు. పిండజ్ఞాని దీనిని గ్రహించవలెను. అయితే దేహము పూర్తిగా నిరుపయోగమైనదని భావించ వలదు, భక్తి పథములో పయనించే వారికి యిది సాధన ప్రాయమైనది.

**వచనము సంఖ్య-13**

**కన్నడ మూలము**

**అండజ వెంబతత్తియొడెదు**
**పిండ పల్లట వాగి**
**గండ గండరనరసి తొళలుత్తైదారె**
**ఖండమండల దొళగె కండె నొందు చోదవ**
**కందన కైయ దర్పణవ ప్రతిబింబ నుంగిత్తు**
**దివరాత్రియు దయద బెళగను కత్తలె నుంగిత్తు**
**గుహేశ్వర నల్లియే నిర్వయలాగిత్తు**

**తెలుగు రూపము**

అండజమనే గుడ్డు పగిలి
పిండము తారు మారై
గండర గండలనెరిగి తిరుగాడు చున్నారు.
ఖండమండలములోన గంటి నొక చోదము
బిడ్డ చేతి దర్పణమును ప్రతిబింబము మింగినది
దివారాత్రుల ఉదయపు వెల్గును చీకటి మింగినది
గుహేశ్వరుని యందే నిర్బయలైనది.

**వ్యాఖ్య:-**

మాయా వైచిత్రిని వివరించే వచన మిది యని యెరుగ వలెను కైవల్యా వస్థలోని శివుడు సమాది స్థితిలో నుండును. ప్రవృత్తి క్రమములో సమాధి భగ్నమగును

దీనిని అల్లమ ప్రభువు నిర్బయలని సూచించిరి. శివుని శక్తి మాయగా పరిణమించిన దశలో మాయా ప్రభావమునకు లోనైన శివుడు జీవుడగుచున్నాడు. పిండము తలక్రిందులగుట యనేది దీనిని సూచించుచున్నది. గండరగండలనే వారు షట్త్రింశత్ తత్త్వములలోని శుద్ధ తత్త్వములైన శివో, శక్తి సదాశివ, ఈశ్వర, శుద్ధవిద్యలకు చెందిన వారు. వీరి నెరిగిన వాడై వీరి వలే తాను యెదగాలని జీవుడు తలచును. నివృత్తి మార్గములో పయనించుటకై కష్టపడుచూ తిరుగాడు పిండుడై పిండజ్ఞాని యగును. మాయా విలాస వైచిత్రి యతని జ్ఞానమును హరించును. తత్ఫలిముగా తనను తానెరుగని స్థితికి చేరి కొనును. దర్పణ మదృశ్యమగుట యనేది దీనిని సూచించుచున్నది. మాయాప్రభావము వలన పిండజ్ఞాని నివసించే పరిసరములన్నియూ అజ్ఞాన మయములగును. లోకములు మిథ్యనే సత్యమని, సత్యమును మిథ్యగా తలచుచుండును. ఇది అంతయూ అవిద్యా తత్త్వము వలన సంభవించే పరిణామము. శుద్ధ విద్యాతత్త్వమే మాయా ప్రభావము చేత అవిద్యయగును. కైవల్య దశలో సర్వజ్ఞుడుగా నున్న శివుడు, జీవుడైన దశలో నతడు కించిత్-జ్ఞానవంతుడగును. మర్మగర్భముగా నున్న యీ వచనమును సరిగా యవగాహన చేసి కొనని స్థితిలో పాఠకులు అయోమయ పరిస్థితినెదుర్కొనవలసి వచ్చుననేది గ్రాహ్యము.

**వచనము సంఖ్య-14**

**కన్నడ మూలము**

**రక్కసిగిబ్బరు మక్కళు తొట్టలమే లైవరు**
**రక్కసి బాణతియాదడె మక్కళగిన్నెంతో?**

**తొట్టలుతూగువ జోగుళవాడువ**
**రక్కసిబాణతియ తొట్టలు నుంగిత్తు**
**ఇదేను హేళా గుహేశ్వరా!**

**తెలుగు రూపము**

రక్కసికి యిరువురు బిడ్డలు
తొట్టెలలో నైదుగురు

రక్కసి బాలెంతయైనచో పిల్లల
కింకను నెటులో!
తొట్టెల నూపే జోలపాటపాడే
బాలెంతను తొట్టెల మింగినది
ఇదేమో చెపుమా గుహేశ్వరా!

**వ్యాఖ్య:-**

విషయ వాంఛల ఉత్పత్తి గురించి తెలిపే వచనముగా దీనిని గైకొనవచ్చును. రక్కసికి యైదుగురు బిడ్డలు తొట్టె యందున్నారు. ఒడిలోన నిరువురు గలరు. ఆమె గర్భవతి. గర్భములోన యెందరున్నారో యేయో? ఇదే విధిన కొనసాగి కొనసాగి చివరకు ఆమె మరణించినది. కాన్పులే మరణానికి కారణమని యెరుగవలెను. మనస్సును రక్కసితో పోల్చవచ్చును. విషయవాంఛలకు జన్మస్థానము. కోరికలకు అంతు ఉండదు. ఉత్పత్తి నిరంతరమూ కొనసాగేది. కోరికలను నియంత్రించ వలసిన అవశ్యకత కలదు. విషయ వాంఛలను నియంత్రించలేని వారు నైతిక పతనమును పొందెదురు. పాపాధిక్యతను పొందుదురు. అంతరంగ శుద్ధిని కోల్పోయిన స్థితికి చేరుదురు. పిండ జ్ఞాని కాయపు కలవరమునకు లొంగ వలదు. ఇంద్రియ వికారములకు లోను కావలదు. విషయ వాంఛల విషవలయ ప్రభావము నుండి బహిర్గతుడైన వాడు నిర్మలుడై ప్రకాశించును. రక్కసిని మాయతో పోల్చే వారు కలరు. పంచేంద్రియములు మాయ బిడ్డలని భావించి చేయబడే విశ్లేషణలు కలవు.

**వచనము సంఖ్య-15**
**కన్నడ మూలము**

**గగనద మేలొందు అభినవగిళి హుట్టి**
**సయ సంభ్రమదల్లి మనెయ మాడిత్తు**
**బ్రహ్మనాగిళిగె హంజరవాద**
**విష్ణు ఆగిళిగె కొరెవ కూళాద**
**రుద్రనాగిళిగెతా కోళాద**
**ఇంతమూవర ముందణ కందననుంగి**

**దృష్టనామ నష్టవాయిత్తు**
**ఇదెంతో గుహేశ్వరా!**

**తెలుగు రూపము**

గగనము మీదటొక అభినవ చిలుక పుట్టి
సత్య సంభ్రమములోన నొక యిల్లుకట్టింది
బ్రహ్మ ఆచిలుకకు పంజరమయ్యె
విష్ణు వాచిలుకకు కొరికే కూడయ్యె
రుద్రుడా చిలుకకు బాణమయ్యె
ఇటులీ ముప్వురి ముందాట గనిన దానిని తిని
దృష్ట నామము నష్టమైనది
ఇది యెటులో గుహేశ్వరా!

**వ్యాఖ్య:-**

జీవుడే విధముగా భోక్తృవగు చున్నాడో అనే దానిని యీ వచనము వివరించుచున్నది. ఉపనిషద్వాదుల ప్రకారము, ఆత్మ ప్రారబ్ధకర్మనను భవించుటకై దేహము ధరించవలెను. దేహ ధారణ నిమిత్తము భూలోకమున పుట్టవలెను. ఆగమ విదుల వివరణ ప్రకారము, శివుడు జీవుడై స్థూల, సూక్ష్మ కారణ శరీరము దాల్చును జీవిగా కర్మఫల భోక్త యగును చిలుక పుట్టుకపై యంశములను సూచించుచున్నది. ఇల్లు కట్టిన దనగా నివాసమేర్పరచి కొనుట. విధాత దేహమును ప్రకల్పించుచున్నాడు. దేవ, పక్షి, మనుష్యాది దేహములలో నేదో ఒకటి లభ్యమగును. 84 లక్షల విధముల శరీరములు గలవని తెలుపబడినది. పూర్వజన్మ కర్మఫలమే యిట నిర్ణయించే అంశము. విష్ణువు భోజ్యమై జీవునికి పోషణ కల్పించును. కర్మానుభవ పరిసమాప్తిని పురస్కరించికొని దేహత్యాగము నిర్ణయింపబడును. రుద్రుడు కాలుడై కడతేర్చును. జీవుడు ఆగామి కర్మను తీసికొని వెళ్ళును. మళ్ళీ జన్మించును. ఈ విధముగా జనన ప్రక్రియ నిరంతరము కొనసాగును. లింగైక్య సిద్ధిగల్గే వరకు జనన-మరణములు గల్గునని పిండజ్ఞాని యెరిగిన వాడై కర్మజిత్తగుటకై యత్నించ వలెను. దృష్ట నామ నష్టమనేది జాగ్రత్తగా గమనించవలెను. నామ నష్టమనగా జీవత్వనష్టము దీనిని యెటుల పొందాలనేది పిండజ్ఞాని యెరుగ లేదనేది గ్రాహ్యము.

## వచనము సంఖ్య-16

### కన్నడ మూలము

నెలదబొంబెయ మాడి, జలదబణ్ణవ
నుడిసి,
హలవు పరియాత్రిమ దళ్లి
ఉలివ గెజ్జెయ కట్టి

వాయు వనలన సంచిక్కె అరకెలెయ
శృంగారవ మాడి
ఆడిసువ యంత్రవాహకనారో?

బయల కంబక్కె తందు సయవెందు
పరవ కట్టెదడె
సయవద్వయవాయిత్తు!
ఏ నెంబెను గుహేశ్వరా!

### తెలుగు రూపము

మట్టి బొమ్మను చేసి, నీటిరంగు పులిమి
పలురకముల ఆశ్రమములందున
సవ్వడి చేసే గజ్జెల గట్టి
వాయువనలముల సంచికి

మట్టి ఆకుల శృంగారము చేసి
ఆడించే యంత్రముకు వాహకుడెవ్వరో?
బయటి స్తంభము కడకుతెచ్చి
పరమును కట్టినచో
సత్యమద్వయమైనది
ఏ మందును గుహేశ్వరా!

**దృష్టనామ నష్టవాయిత్తు**
**ఇదెంతో గుహేశ్వరా!**

**తెలుగు రూపము**

గగనము మీదటొక అభినవ చిలుక పుట్టి
సత్య సంభ్రమములోన నొక యిల్లుకట్టింది
బ్రహ్మ ఆచిలుకకు పంజరమయ్యె
విష్ణు వాచిలుకకు కొరికే కూడయ్యె
రుద్రుడా చిలుకకు బాణమయ్యె
ఇటులీ ముప్పురి ముందాట గనిన దానిని తిని
దృష్ట నామము నష్టమైనది
ఇది యెటులో గుహేశ్వరా!

**వ్యాఖ్య:-**

జీవుడే విధముగా భోక్తృవగు చున్నాడో అనే దానిని యీ వచనము వివరించుచున్నది. ఉపనిషద్వాదుల ప్రకారము, ఆత్మ ప్రారబ్ధకర్మనను భవించుటకై దేహము ధరించవలెను. దేహ ధారణ నిమిత్తము భూలోకమున పుట్టవలెను. ఆగమ విదుల వివరణ ప్రకారము, శివుడు జీవుడై స్థూల, సూక్ష్మ కారణ శరీరము దాల్చును జీవిగా కర్మఫల భోక్త యగును చిలుక పుట్టుకపై యంశములను సూచించుచున్నది. ఇల్లు కట్టిన దనగా నివాసమేర్పరచి కొనుట. విధాత దేహమును ప్రకల్పించుచున్నాడు.దేవ, పక్షి, మనుష్యాది దేహములలో నేదో ఒకటి లభ్యమగును. 84 లక్షల విధముల శరీరములు గలవని తెలుపబడినది. పూర్వజన్మ కర్మఫలమే యిట నిర్ణయించే అంశము. విష్ణువు భోజ్యమై జీవునికి పోషణ కల్పించును. కర్మానుభవ పరిసమాప్తిని పురస్కరించికొని దేహత్యాగము నిర్ణయింపబడును. రుద్రుడు కాలుడై కడతేర్చును. జీవుడు ఆగామి కర్మను తీసికొని వెళ్ళును. మళ్ళీ జన్మించును. ఈ విధముగా జనన ప్రక్రియ నిరంతరము కొనసాగును. లింగైక్య సిద్ధిగల్గే వరకు జనన-మరణములు గల్గునని పిండజ్ఞాని యెరిగిన వాడై కర్మజిత్తగుటకై యత్నించ వలెను. దృష్ట నామ నష్టమనేది జాగ్రత్తగా గమనించవలెను. నామ నష్టమనగా జీవత్వనష్టము దీనిని యెటుల పొందాలనేది పిండజ్ఞాని యెరుగ లేడనేది గ్రాహ్యము.

## వచనము సంఖ్య-16

### కన్నడ మూలము

నెలదబొంబెయ మాడి, జలదబణ్ణవ
నుడిసి,
హలవు పరియాత్రిమ దల్లి
ఉలివ గెజ్జెయ కట్టి
వాయు వనలన సంచిక్కె అరళెలెయ
శృంగారవ మాడి
ఆడిసువ యంత్రవాహకనారో?
బయల కంబక్కె తందు సయవెందు
పరవ కట్టెదడె
సయవద్వయవాయిత్తు!
ఏ నెంబెను గుహేశ్వరా!

### తెలుగు రూపము

మట్టి బొమ్మను చేసి, నీటిరంగు పులిమి
పలురకముల ఆశ్రమములందున
సవ్వడి చేసే గజ్జెల గట్టి
వాయువనలముల సంచికి
మఱ్ఱి ఆకుల శృంగారము చేసి
ఆడించే యంత్రముకు వాహకుడెవ్వరో?
బయటి స్తంభము కడకుతెచ్చి
పరమును కట్టినచో
సత్యమద్వయమైనది
ఏ మందును గుహేశ్వరా!